Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 167 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 జూలై 2023 శనివారం పేజీలు : 4

## ఒక్కసారిగా పెరిగిన బంగారం, వెండి ధరలు..

బంగారం, వెండి ధరలు ఇవాళ ఊపందుకున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గడమో లేదంటే స్థిరంగానో ఉంటూ వచ్చిన బంగారం, వెండి ధరలు నేడు పరుగు ఆరంభించాయి. మరి ఈ పరుగు అనేది ఇవాళ్టి వరకేనో.. కొద్ది రోజుల పాటు కొనసాగుతుందో చూడాలి. మొత్తానికి బంగారం, వెండి కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. అసలు నేటి పెరుగుదలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం అయితే లేదు.. ఆ స్థాయిలో పెరిగిందేమీ లేదు కానీ ఒకసారి పెరిగిందంటే.. దాదాపు కొన్ని రోజుల పాటు రోజువారీగా పెరుగుతూనే ఉంటుంది కాబట్టి కాస్త భయపడాల్సిన విషయమే. నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ. 100 పెరిగి రూ. 54,250గా ఉంది. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ. 100 పెరిగి రూ. 59,160కి చేరుకుంది. ఇక వెండి ధర విషయానికి వస్తే.. కిలోపై రూ. 800 పెరిగి రూ. 73 వేలకు చేరుకుంది.




# ముందస్తు ప్రచారం షురూ చేసిన కేసీఆర్

## 15 నుండి కేసీఆర్ వరుస పర్యటనలు

## ఐదు జిల్లాలలో భారీ బహిరంగ సభలు

హైదరాబాద్: గత నెలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, జిల్లాల పర్యటనలు, మహారాష్ట్ర టూర్ షెడ్యూలుతో బిజీగా గడిపిన ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల మూడో వారం నుంచి మళ్లీ క్షేత్ర స్థాయి పర్యటనలు మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో పాటు ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికల సన్నద్ధతను మరింత వేగవంతం చేయాలని భావిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఈ నెల మూడో వారం నుంచి పాల్గొనే వరుస కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూలు సిద్ధమవుతోంది. జిల్లా కలెక్టరేట్ సముదాయాలు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల ప్రారంభంతో పాటు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటున్నారు. జూలైలో మరో ఐదు జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం జిల్లాల పర్య టన షెడ్యూలును మరో రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముందని సమాచారం. సీఎం పర్యటించే జిల్లాల జాబితాలో సూర్యాపేట, నల్ల గొండ, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 15 తర్వాత సీఎం పర్యటన ఉండే అవకాశం ఉండగా, జిల్లా కలెక్టరేట్ సముదాయం, పార్టీ కార్యాలయంతో పాటు చనాకా-కొరాటా ప్రాజెక్టును ప్రారంభించే అవకాశముందని చెపుతున్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ కలెక్టరేట్ సముదా యంతో పాటు మెడికల్ కాలేజీని కేసీఆర్ ప్రారంభిస్తారని తెలుస్తోంది. సూర్యాపేట లేదా కోదాడలో బస చేసి మరుసటి రోజు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సభకు హాజరయ్యేలా సీఎం షెడ్యూలు ఉంటుందని తెలుస్తోంది. మెదక్, కరీంనగర్ జిల్లాల కలెక్టరేట్ సముదాయాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, నెలాఖరు లోగా ప్రారంభిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.

**ఇతర జిల్లాల్లోనూ బహిరంగ సభలు :** జిల్లా కలెక్టరేట్ల ప్రారంభం లేని చోట కూడా బహిరంగ సభలు నిర్వహించే యోచనలో బీఆర్ ఎస్ అధినేత ఉన్నట్లు పార్టీ వర్గాల సమా చారం. 2018 ఎన్నికల తర్వాత నారాయణపేట జిల్లాలో అడుగు పెట్టని సీఎం కేసీఆర్, ఈ జిల్లాలో త్వరలో పర్యటించే అవకాశముందని స్థానిక బీఆర్ఎస్ నేతలు చెపుతున్నారు. గత నెలలో మహారాష్ట్రలోని నాగపూర్, సోలాపూర్‌లలో పర్యటించిన కేసీఆర్.. త్వరలో పుణే లేదా భివండీలో సభ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లోనూ పార్టీ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో అక్కడా సభల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పుణేలలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయా లను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 8తో మహారాష్ట్రలో బీఆర్ఎస్ సభ్య త్వ నమోదు, సంస్థాగత కమిటీల ఏర్పాటు షెడ్యూ లు కొలిక్కి రానుంది. ఇప్పటికే 20 లక్షల మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నట్లు మహా రాష్ట్ర నేతలు వెల్లడించారు.

సంస్థాగత కమిటీల శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 20 తర్వాత మహారాష్ట్రలో సీఎం పర్యటించే అవకాశ ముంది. ఏడాది చివరలో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఈ నెల 18 లేదా 19న మంత్రులు, పార్టీ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్ర కార్యవర్గం, కార్పొరేషన్, జిల్లా పరిషత్ చైర్మన్లతో సమావేశం ఉంటుందని తెలంగాణ భవన్ వర్గాలు వెల్లడించాయి.




గ్రేటర్ హైదరాబాద్ పై భారత రాష్ట్ర సమితి ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎంఐఎం స్థానాలు మినహా మిగతా అన్ని చోట్ల క్లీన్ స్వీప్ చేయాలన్న లక్ష్యంతో వ్యూహాలు రూపొందిస్తోంది. మరోవైపు కొంతమంది సిట్టింగ్‌లపై వేటు తప్పదన్న సంకేతాలతో మహానగరంలో మార్పులు ఎలా ఉండబోతున్నాయన్న చర్చ జరుగుతోంది. శాసనసభ్యులందరూ పూర్తి ధీమాతో ఉండగా తమకు అవకాశం ఇవ్వాలంటూ ఇతర నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# హస్తం గూటికి ఏనుగు రవీందర్ రెడ్డి, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి




హైదరాబాద్: బీజేపీలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎన్నం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారన్న వార్తలు ఊపందుకున్నాయి. పార్టీలో కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన, తాజాగా చోటుచేసుకున్న మార్పులు చేర్పుల నేపథ్యంలో కాంగ్రెస్ నేతలతో వీరిద్దరి సంప్రదింపులు ముమ్మరమయ్యాయి. పార్టీలోని తాజా పరిణామాల నేపథ్యంలో అందులో ఇమడలేక వీరు కాంగ్రెస్‌లో చేరాలనే నిర్ణయానికి వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఏనుగు రవీందర్‌రెడ్డి ఇప్పటికే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపినట్లు గాంధీభవన్ వర్గాల సమాచారం. మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాసరెడ్డి కూడా ఆ జిల్లాకే చెందిన జూపల్లి కృష్ణారావుతో చర్చలు జరిపారు. బీజేపీని విడిచిపెట్టి కాంగ్రెస్‌లో చేరడమే వీరి మధ్య జరిగిన చర్చల ప్రధాన ఉద్దేశమని సమాచారం.

**రవీందర్ రెడ్డికి టికెట్టుపై నోక్లారిటీ...** ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి రెండేండ్ల క్రితమే బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ తో కలిసి నడుస్తున్నారు. ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఈటలతో పాటే కలిసి వెళ్లేవారు. ఇటీవల గౌహాతికి వెళ్లినప్పుడు కూడా ఈటల వెంటే ఉన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌ను నియమించిన తర్వాత శామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో సందడి నెలకొన్నా, ఏనుగు రవీందర్ రెడ్డి కనిపించకపోవడం చర్చకు దారితీసింది. కిషన్‌రెడ్డిని అధ్యక్షుడిగా, ఈటల రాజేందర్‌ను కమిటీకి చైర్మన్‌గా నియమించడానికి ఐదారు రోజుల ముందే రేవంత్‌తో ఏనుగు రవీందర్ రెడ్డి చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే ఎల్లారెడ్డిలో ఇప్పటికే మదన్‌మోహన్‌రావు, సుభాష్‌రెడ్డి మధ్య టికెట్ వార్ నడుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు పార్టీలో చేరినా అక్కడ అవకాశం ఇవ్వడం కష్టమేనని రేవంత్ క్లారిటీ ఇచ్చినట్లు తెలిసింది. బాన్సువాడ నుండి అవకాశం కల్పిస్తామని చెప్పినా, తాను అక్కడ నాన్-లోకల్ అవుతానని, ఇబ్బందులుంటాయని రవీందర్ రెడ్డి సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. దీంతో టికెట్లు ఇచ్చేవరకు బీజేపీలోనే కొనసాగి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలనే ఆలోచనలో సైతం ఏనుగు రవీందర్ రెడ్డి ఉన్నట్లు తెలిసింది...!!

# 10-12 మధ్య...

# తేలనున్న 'బండి' భవితవ్యం




## ప్రధాని, రాష్ట్రపతి పర్యటనలతో మంత్రివర్గ విస్తరణకు బ్రేక్

కరీంనగర్ : బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర మంత్రి పదవి వరించేది, లేనిది తేలడానికి మరో వారం పట్టే అవకాశం ఉన్నది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ రాజధానిలో లేకపోవడం, ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటనకు తెలంగాణకు రానున్న నేపథ్యం కారణంగా మంత్రి వర్గ పునర్ వ్యవస్థీకరణ ఆలస్యం కానున్నది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు పూనుకున్నది. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ కుమార్‌ను మార్చి ఆయన స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించింది. రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సంజయ్ సేవలను వినియోగించుకోవడానికి కేంద్ర నాయకత్వం ఆయనకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించడమో లేక జాతీయ కార్యదర్శిగా నియమించి కొన్ని రాష్ట్రాలకు బాధ్యులుగా పంపించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఒకే వ్యక్తికి ఒకే పదవి అన్న కారణంతో కేంద్ర మంత్రి పదవికి కిషన్‌రెడ్డి రాజీనామా చేయాల్సి ఉన్నది. ఆయన రాజీనామాతో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకుండా పోతుంది. ఆయన స్థానంలో రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన బండి సంజయ్ కుమార్‌కు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతున్నది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారని తెలుస్తున్నది. గత మంత్రి వర్గ కూర్పు సమయంలోనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా గిరిజనులకు ప్రాధాన్యం కల్పించినట్లవుతుందని, ఆయా వర్గాల్లో పార్టీని మరింత బలంగా తీసుకు వెళ్లేందుకు వీలు కలుగుతుందని భావించారు. అప్పటి సమీకరణాల కారణంగా అది వీలు కాకపోవడంతో ఇప్పుడు ఆయన పేరు బలంగా వినవస్తున్నది.

**జాతీయ స్థాయిలో పార్టీకి సేవలా.. ప్రభుత్వంలోకా..?** రాష్ట్ర అధ్యక్షుడిగా రాజీనామా చేసిన సంజయ్ తాను సామాన్య కార్యకర్తగానే ఉంటానని ప్రకటించడం పార్టీ నాయకత్వంపై కినుకతోనేనని భావిస్తున్నారు. ఆయనలో అసంతృప్తిని తొలగించి గతంలో మాదిరిగానే చురుకుగా వ్యవహరించేందుకు మంత్రి పదవి కట్టబెట్టే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. రాష్ట్రానికి రెండు మంత్రి పదవులు ఇచ్చే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. పార్టీలో జాతీయ కార్యదర్శి హోదాకు మంచి ప్రాధాన్యం ఉన్నా సొంత రాష్ట్రంలో క్రియాశీలంగా వ్యవహరించే అవకాశం లేనందువల్ల సంజయ్ ఆ పదవి పట్ల సుముఖంగా లేరని అందుకే కేంద్ర నాయకత్వం మంత్రి పదవిని కట్టబెట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ జిల్లాలో పర్యటించి బహిరంగ సభలో పాల్గొననున్నారు. 9న హైదరాబాద్‌లో జరిగే దక్షిణాది రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, మంత్రులు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ వ్యవస్థాగత అంశాలపై, తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై చర్చిస్తారని సమాచారం. ఆయన 9న రాత్రి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఆ సమయానికి రాష్ట్రాల పర్యటనలు ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఢిల్లీ చేరుకుంటారు. ప్రధాని తిరిగి ఈ నెల 13న విదేశీ పర్యటనకు వెళ్లనున్నందున 10 నుంచి 12వ తేదీలోగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని భావిస్తున్నారు.


ఈ మంత్రివర్గ కూర్పులోనే సంజయ్ భవితవ్యం తేలుతుంది. సంజయ్‌కి మంత్రి పదవి లభిస్తే ఒకే విడతలో మూడు ఉన్నత స్థాయి పదవులు అలంకరించిన వ్యక్తిగా మారనున్నారు. 2019లో కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన ఆయన కొంత కాలానికే రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే ఐదేళ్ల వ్యవధిలో మూడు క్రియాశీల పదవులను నిర్వహించిన వ్యక్తిగా గుర్తింపు పొందుతారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఢిల్లీ నుంచి బయల్దేరి బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. వరంగల్‌లో మకాం వేసి ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# సంపాదకీయం

## వేడెక్కిన 'అనర్హత' రాజకీయాలు

ఎన్సీపీ చీలికతో మహారాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కిపోయాయి. ఇపుడు ఒకరిపై మరొకరు అనర్హత వేటుకు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. పార్టీని చీల్చి ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేతో చేతులు కలిపిన ఎంఎల్‌ఏలపై అనర్హత వేటువేయాలని ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడు శరద్ పవార్ స్పీకర్ కు లేఖ రాశారు. ఇదే సంరద్భంగా తమదే అసలైన పార్టీయని శరద్ పవార్ వర్గంపై అనర్హత వేటువేయాలని అజిత్ పవార్ స్పీకర్ కు ఫిర్యాదుచేశారు. పార్టీని చీల్చి షిండేతో చేతులు కలిపిన అజిత్ తమదే అసలైన ఎన్సీపీ అని వాదిస్తున్నారు. ఎన్సీపీకి 53 మంది ఎంఎల్‌ఏలున్నారు. వీరిలో 30 మంది మద్దతుదారులతో అజిత్ పార్టీని చీల్చేశారు. దాదాపు ఏడాదిన్నరక్రితం శివసేనను ఏక్ నాథ్ షిండే ఎలా చీల్చేశారో ఇపుడు అజిత్ కూడా అలాగే చేశారు. పార్టీ తనదే అని అజిత్ చెప్పలేకపోవచ్చు కానీ అసెంబ్లీలో మాత్రమే ఎన్సీపీ గుర్తింపు తమకే దక్కాలని పట్టుబట్టే అవకాశముంది. ఎందుకంటే 53 మంది ఎంఎల్‌ఏల్లో 30 మంది అజిత్ తోనే ఉన్నారు కాబట్టి. అయితే అసెంబ్లీలో ఎన్సీపీ ఒకళ్ళది బయట ఎన్సీపీ మరొకళ్ళదిగా ఉండే అవకాశం లేదు. మొత్తంమీద అబ్బాయ్ అజిత్ గట్టిగానే బాబాయ్ శరద్ ను దెబ్బకొట్టారు. అజిత్ దెబ్బకొట్టడం కన్నా దశాబ్దాలుగా తనకెంత నమ్మకస్తుడిగా ఉన్న ప్రఫుల్ పటేల్ కూడా అజిత్ తో చేతులు కలిపి తనను దెబ్బకొట్టడమే శరద్ ను ఎక్కువగా వేధిస్తున్నదట. గతంలో పార్టీలో ఎంతమంది ఎన్నిరకాలుగా తిరుగుబాట్లుచేసినా ఎదురుతిరిగినా పార్టీని వదిలి వెళ్ళిపోయినా ప్రఫుల్ పటేల్ మాత్రం శరద్ తోనే ఉన్నారు. అందుకనే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హెూదా ఇచ్చారు. అలాంటిది ప్రఫుత్ కూడా దెబ్బకొట్టడమే ఆశ్చర్యంగా ఉంది. అందుకనే అజిత్‌ంప్రఫుల్ తో పాటు మంత్రులుగా ప్రమాణంచేసిన తొమ్మిది మందిని పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు అనర్హులను చేయాలని శరద్ స్పీకర్ కు లేఖరాశారు. అయితే శరద్ కోరినట్లు స్పీకర్ చర్యలు తీసుకుంటారని అనుకునేందుకు లేదు. ఎందుకంటే స్పీకర్ ప్రభుత్వానికి అనుకూలమైన నేత కాబట్టే. మరి శరద్ ఏమిచేస్తారో చూడాలి.

# చుక్క.. ముక్కకు దూరం.. ఆ పల్లెలు



తాండూరు : ప్రస్తుత కాలంలో మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉండడం చాలా అరుదు.. కానీ ఆ గ్రామాల్లోని నేటి యువతరం కూడా తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తూ పలువురికీ ఆదర్శంగా నిలుస్తూ, పుట్టుక నుంచి ఆఖరి మజిలీ వరకు ప్రత్యేకమైన సంప్రదాయాలను పాటిస్తూ, మద్యం మాంసాహారాలకు దూరంగా ఉంటూ, ప్రత్యేక జీవనాన్ని గడుపుతున్నారు.మంచిర్యాల జిల్లా తాండూరు మండల పరిధిలోని చౌటపల్లి గ్రామం, బెల్లంపల్లి మండల పరిధిలోని అంకుశం గ్రామాల్లో రెండు లింగధరి గూడాలు ఉన్నాయి. అక్కడ లింగధరికోయ తెగకు చెందిన ఆదివాసీలు జీవనం సాగిస్తుంటారు. ఆదివాసీలు అనగానే సాధారణంగా మాంసాహారులు అనే అభిప్రాయం కలుగుతుంది. కానీ ఇక్కడ నివసించే వారిలో ఏ ఒక్కరు కూడా మద్యం, మాంసాహారాలు ముట్టరు. కనీసం గ్రామంలో కోళ్లు మేకలను కూడా పెంచరంటే ఏ విధంగా ఉంటున్నారో అర్థమవుతుంది. రెండు లింగధరిగూడాల్లో కలిపి సుమారు 102 కుటుంబాలు ఉండగా.. 360 వరకు జనాభా ఉంది. ఇక్కడి వారంతా ప్రధానంగా వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు.

ఆనాటి నుంచీ దూరం...సుమారు 300 సంవత్సరాల క్రితమే ఈ రెండు గూడాలు ఏర్పడ్డాయి. తాతముత్తాతల కాలం నుంచే వీరు మద్యం మాంసాలకు దూరంగా ఉంటారు. నేటికీ ఆ గ్రామాల్లో ఎవరూ మద్యం తాగడం కానీ , మాసం తినడం కానీ చేయరు. గ్రామంలో కోళ్లు, మేకలు ఎక్కడా కనిపించవు. ఇంటికో గేదె లేదా ఆవు ఉంటాయి. గర్భిణులు, శిశువుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వచ్చే కోడిగుడ్లను కూడా తిప్పి పంపించేసి బంద్ పెట్టించారు. పూర్వీకులు పాటించిన ఆచార వ్యవహారాల్లోనే జీవనం కొనసాగిస్తున్నారు. అందుకే చాలా మంది ఎక్కువ కాలం ఆరోగ్యవంతంగా ఎవరి మీదా ఆధారపడకుండా వారి వ్యక్తిగత పనులు వారే చేసుకుంటూ జీవిస్తున్నారు.

ఇదీ వారి ప్రత్యేకం..

లింగధరి కోయ తెగలోని కుటుంబీకుల్లో పుట్టిన శిశువులకు 21వ రోజున రుద్రాక్షధారణ, పెళ్లికి ముందు యువతీయువకులకు లింగధారణ చేస్తారు. కుల పెద్దలే వివాహ తంతును నిర్వహిస్తారు. మామూలుగా ప్రతి ఒక్కరూ ఆడపిల్ల ఇంట్లో పెళ్లి జరిపిస్తారు.. కానీ వీరిలో అబ్బాయి ఇంటి దగ్గర వివాహం చేస్తారు. శివలింగం వీరి ఆరాధ్య దైవం. 2008లో కామెర కొండయ్య చౌటపల్లి గ్రామ పరిధిలోని లింగధరిగూడెంలో అంబేధ కొండయ్య మహారాజ్ ఆలయాన్ని నిర్మించారు. అందులోనే లింగాన్ని ప్రతిష్టించారు. ప్రతి రోజూ గ్రామంలోని ఎవరో ఒకరు తప్పనిసరిగా ఆలయాన్ని శుభ్రపరచి పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. ఏటా ఫిబ్రవరి లేదా మార్చి నెల మాఘమాసంలో వచ్చే మాఘశుద్ధ విదియ రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గూడెంలో పెద్ద పండుగలా వేడుక చేసుకొని అందరూ సహపంక్తి భోజనాలు చేస్తారు.

అంత్యక్రియల్లోనూ విభిన్నమే..లింగధరి కోయల్లో ఎవరైనా చనిపోతే విభిన్నంగా అంత్యక్రియలు నిర్వహిస్తారు. మృతదేహాన్ని కాల్చకుండా సమాధి చేస్తారు. భూమిలో గుంత తవ్వి లోపలికి గుహలా చేసి అందులో మృతదేహాన్ని కూర్చోబెట్టి విబూధి, ఉప్పు వేసి పూడ్చేస్తారు.

నాటి నుంచి ఇదే పద్ధతి..– సురేశ్ యువకుడు (చౌటపల్లి)

తాతముత్తాతలు సూచించిన విధంగానే మద్యం, మాంసాలకు దూరంగానే ఉంటున్నాం. శుభకార్యాలు జరిగినా శాకాహార వంటలతోనే భోజనాలు ఏర్పాటు చేస్తాం. ఇక్కడి నుంచి ఉపాధి నిమిత్తం వేరే గ్రామాలకు వెళ్లిన మావాళ్లు కూడా ఆవే నిబంధనలు పాటిస్తున్నారు. పూజలు, పెళ్లిళ్లు మా కుల పెద్దలే దగ్గరుండి జరిపిస్తారు.

సంప్రదాయాలు పాటిస్తూ..– గురుదాసు (అంకుశం)

మా జీవన విధానం, ఆచార వ్యవహారాలు విభిన్నం. మా తెగ వాళు ఇళ్లలోనే కాదు బయట కూడా మద్యం, మాంసం ముట్టం.. కోళ్లు, మేకలను కూడా గ్రామంలో పెంచం.. ఆకుకూరలు, పప్పుదినుసులు, కూరగాయలనే భోజనంగా స్వీకరిస్తాం. అందుకే ఆరోగ్యంగా ఉంటున్నాం.

# ఉన్నత ఉద్దేశం.. నిర్వహణ లోపం!



మహబూబ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన వైకుంఠథామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు స్థానిక పాలకవర్గాల నిర్లిప్తత.. నిర్వహణ సమస్యలతో నిరుపయోగంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రూ.218.51 కోట్లతో 1,681 వైకుంఠథామాలను, రూ.42.23 కోట్లతో 1,690 సెగ్రిగేషన్ షెడ్లను, రూ.10.14 కోట్లతో 1692 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పల్లె ప్రగతిలో భాగంగా ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ పనులు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మించగా, పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీ శాఖకు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో 90 శాతం వైకుంఠథామాలు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు చెత్త తెచ్చి పోగేయడానికి సరిపోతుంది. తడి, పొడి చెత్త వేర్వేరుగా చేసి సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి పెట్టడం లేదు. పల్లె ప్రకృతి వనాలకు నిర్వహణ నిధులు లేకపోవడంతో వీటి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. మంచి ఉద్దేశంతో చేపట్టిన వీటిని ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

కారణాలివీ.. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించడానికి అధికారులు ఆకుపచ్చ, నీలం చెత్తబుట్టలు పంపిణీ చేశారు. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, స్థానిక సర్పంచులు పట్టించుకోకపోవడంతో ఎక్కడా సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించడం లేదు.వైకుంఠథామాలకు నీటి సౌకర్యం, విద్యుత్తు కనెక్షన్ లేక వినియోగం అంతతమాత్రంగానే ఉంది. పలు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు సొంత పొలాల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. కొన్ని వర్గాలు కేవలం ఖననం మాత్రమే చేస్తాయి. ఆ వర్గాలకు వైకుంఠథామాల వల్ల ఉపయోగిం లేకుండాపోయింది.

పల్లె ప్రకృతి వనాల్లో ప్రతి నెలా నిర్వహణ ఖర్చు ఉంటుంది. మొక్కలకు ఎరువులు వేయడం, నీటిని వినియోగించడం వంటివి చేయాలి. వీటి కోసం ప్రత్యేకంగా నిధులు అవసరం. నిధులు సమయానికి రాకపోవడంతోనూ ప్రకృతి వనాల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న మానవపాడు మండలం పెద్దపోతులపాడులో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు ఇది. గ్రామంలో సేకరించిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు చెన్నిపాడుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

విద్యుత్తు సౌకర్యం, నీటి సరఫరా లేని మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లిలోని స్మశానవాటిక ఇది. దీంతో స్థానికులు వారి సొంత పొలాల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు.

స్థానిక సంస్థలు బాధ్యత తీసుకుంటే..సెగ్రిగేషన్ షెడ్లు, ప్రకృతి వనాలు, వైకుంఠథామాలు ఉద్దేశానికి అనుగుణంగా వినియోగించడంపై స్థానిక సంస్థలు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ వైపుగా అధికారులు వారిని ప్రోత్సహిస్తేనే.. రూ.కోట్ల ప్రజాధనం వృథా కాదు.తడి, పొడి చెత్త సేకరణ నిబంధనల ప్రకారం చేసి సేంద్రియ ఎరువు తయారీ పకడ్బందీగా చేస్తే హారితహారంలో వినియోగించుకోవడంతోపాటు స్థానిక రైతులకు ఉపయోగపడుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా గుండ్లపొట్లపల్లి, జోగులాంబ గద్వాల జిల్లా మిట్టదొడ్డి గ్రామ పంచాయతీలు సేంద్రియ ఎరువు తయారు చేసి ఆదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. వైకుంఠథామాల్లో విద్యుత్తు, నీటి కనెక్షన్లపై దృష్టి పెడితే జనం అంత్యక్రియలకు ఉపయోగించుకుంటారు. పల్లె ప్రకృతి వనాల నిర్మాణం బాగున్నా, కొన్నింటిలో మాత్రమే జనం కూర్చోవడానికి.. నడకకు ఉపయోగించుకునేలా మలిచారు. ఇటిక్యాల మండలం గోపల్‌దిన్నె, గద్వాల మండలం కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఈ ఏర్పాట్లు చేశారు. మిగతా గ్రామాల్లో మొక్కలు పెంచి వదిలేయకుండా వీటిని ఏర్పాటు చేస్తే జనం పచ్చదనాన్ని ఆస్వాదించడానికి వచ్చే అవకాశముంటుంది.

# ఆర్థిక సాధికారతకు మహా ప్రయత్నం

మహబూబ్‌నగర్ : 'మహా' బ్రాండ్‌తో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు వివిధ ఉత్పత్తులు తయారు చేస్తూ ఆర్థిక సాధికారత దిశగా దూసుకెళుతున్నారు. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు అందించాలని సంకల్పించిన హన్వాడ మండల మహిళా సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో పల్లి(వేరుశనగ) నూనె తయారీ, చింతపండు అమ్మకాలు చేపట్టి లాభాలు ఆర్జిస్తున్నారు. సమాఖ్య నుంచి రూ. 1.90 లక్షలు వెచ్చించి గానుగ యంత్రాన్ని కొనుగోలు చేశారు. మహిళా సంఘం సభ్యులే అయిదు టన్నుల వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసి నూనె తయారీ చేపట్టారు. లీటరు నూనెను రూ. 300లకు అమ్ముతున్నారు. మండలంలోని మహిళా సంఘాల్లో 9,050 మంది అతివలు సభ్యులుగా ఉన్నారు. వారితోపాటు వ్యాపారులకు నూనెను అమ్ముతున్నారు. ఇప్పటివరకు 3వేల లీటర్ల నూనెను తయారు చేశారు. ఈ ప్రక్రియ ద్వారా రూ. 1.28 లక్షల ఆదాయాన్ని ఆర్జించారు. గానుగ నూనె ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లి అమ్మకాలు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అదనపు విలువ జోడించి

హన్వాడ మండలంలో చింత చెట్లు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఉత్పత్తయ్యే చింతపండుకు అదనపు విలువను జోడించి అమ్మకాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవటంతో పాటు అదనపు విలువను జోడించే యంత్రాన్ని కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొంత రాయితీని ప్రకటించింది. చింతపండుతో గుజ్జు, ఇతర పండ్లతో కలిపి శీతల పానీయాలు తయారుచేసేందుకు సిద్ధమయ్యారు. మొదటగా వారు ఏడున్నర టన్నుల చింతపండును సేకరించి పట్టీలు తయారుచేశారు. ఈ మొత్తాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కిలో రూ.120 చొప్పున అమ్మాలని ధర కూడా నిర్ణయించారు. చింతపండును వ్యాపారులకు అమ్మనున్నారు. సింగాపూర్‌కు ఎగుమతి చేయాలనే ఆలోచనలో కూడా ఉన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులనూ ఈ దిశగా ప్రోత్సహించేందుకు మరో అయిదు యంత్రాలు తెప్పించారు. గ్రామీణ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకే ఫుడ్ ప్రాసెసింగ్ యానిట్లను ప్రారంభించామని హన్వాడ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తులసి, ఏపీఎం సుదర్శన్, కార్యవర్గ సభ్యులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

స్వశక్తిపై నిలిచేందుకు

హన్వాడ మండలంలోని పలువురు మహిళలు స్వశక్తిపై నిలించేందుకు ఈ చిన్నపాటి ప్రయత్నం చేస్తున్నాం. ప్రభుత్వం రాయితీని ఇస్తే ప్రతి గ్రామంలో కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. మార్కెటింగే ప్రధాన సవాలు. విస్తృతంగా ప్రచారం చేయటం ద్వారా దాన్ని అధిగమించాలని భావిస్తున్నాం.

– మైబమ్మ, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి, హన్వాడ

ఆచితూచి అడుగులువ్యాపారానికి ఆర్థిక క్రమశిక్షణ చాలా ముఖ్యం. ప్రతీదాన్ని ఆడిట్ చేస్తున్నాం. మూలధనం ఎంత పెడుతున్నాం, ఎలా మార్కెటింగ్ చేస్తున్నాం,

# అడవిబిడ్డల తరలింపుపై అడుగుముందుకు

ఆదిలాబాద్ : కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులి ఆవాసానికి ఆటంకాలు ఉండొద్దని అడవిలో మనుషుల అలజడి తగ్గించేందుకు అభయారణ్యంలోని 18 గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించాలని ప్రభు త్వం నిర్ణయించింది. మొదట జిల్లాలోని కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలో గల మైసంపేట, రాంపూర్ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించేందుకు 2012 సంవత్సరంలో ఈ రెండు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ఎంపిక చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు సర్వేల పేరిట ప్రభుత్వం కాల యాపన చేసిందే తప్ప ఈ రెండు ఆదివాసీ గ్రామాల తరలింపు ప్రక్రియ పూర్తి చేయలేదు. ఓపక్క పునరావాస గ్రామాలంటూ ఈ రెండు గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో గత పదేళ్లుగా ఇక్కడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. ఓవైపు మౌలిక సదుపాయాలు లేక మరోవైపు పునరావాసం కల్పించక మైసంపేట, రాంపూర్ గ్రామాల ప్రజలు అవస్థలు పడ్డారు. దీంతో తమకు పునరావాసం కల్పించాలని లేనిచో మా గ్రామాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని రెండు గ్రామాల ప్రజల నుండి ఇటీవల డిమాండ్ ఊపందుకున్నాయి. గతంలో ప్రతిపాదనలకే పరి మితం అయిన పరిహారం పెంపుపై ఎట్టకేలకు ప్రభుత్వం నుండి సాను కూల స్పందన వచ్చింది. తాజాగా ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల పరి హారం అందజేసేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఈసారైనా తమకష్టాలు గట్టెక్కేనా అంటే ఈ రెండు గ్రామాల ప్రజలు ఆశగా చూస్తు న్నారు. స్వేచ్ఛగా పులుల సంచారానికే పునరావాస ప్రతిపాదనపులులు స్వేచ్ఛగా సంచరించేందుకు ఇక్కడి ప్రాంతాన్ని అనువుగా మార్చాలని అధికారులు సర్వే నిర్వహించారు. 2012లో జరిగిన ఈ సర్వే ప్రకారం కవ్వాల్ అభయారణ్యంలో ఉన్న 18 చిన్న గ్రామాలను ఇతర మై దాన ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. అయితే ఆదివాసీలకు ఇతర ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ ఊపందు కోవడంతో వారికి పునరావాసం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయానికి వ చ్చింది. ఈ నేపథ్యంలో కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని గిరి గ్రామాలైన మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు మొదటివిడత పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఈ దిశగా అప్పటి అటవీశాఖ మంత్రి జోగు రామన్న, స్థానిక ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌తో పాటు పలువురు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ఆ గ్రామాల్లో పర్యటించి పునరావాసంపై అవ గాహన కల్పించారు. మొదట అడవిని వీడేందుకు నిరాకరించిన గిరి బిడ్డ లు ఎట్టకేలకు వారికి అన్నీ సౌకర్యాలు కల్పిస్తామనడంతో వెళ్లేందుకు సిద్ధ పడ్డారు. ఇదంతా 2016లో జరిగింది. అటవీశాఖ ఉన్నతాధికారులు, మంత్రి, ఎమ్మెల్యే అంతా వచ్చి చెప్పడంతో పునరావాసంపై అడవిబిడ్డల్లో ఆశలు పెరిగాయి. కానీ తమకు పునరావాసం గానీ, మౌలిక వసతులు గానీ కల్పిం చడం లేదని, దీంతో తమకు తిప్పలు తప్పడం లేదని అడవిబిడ్డలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హామీలకే పరిమితమైన పునరావాసంకవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ప్రకటించిన తర్వాత 2012లో ఖానాపూర్ డివిజన్ పరిధిలోని మైసంపేట, రాంపూర్, జన్నారం, డివిజన్ పరిధిలోని దొంగపెల్లి, అలీనగర్, మల్యాల గ్రామాలను అడవిలోంచి మైదా న ప్రాంతాలకు తరలిస్తారనే ప్రచారం ప్రారంభమైంది. దీంతో అడవి బిడ్డలు టైగర్‌జోన్‌ను వ్యతిరేకిస్తూ ఎక్కడికక్కడే ఆందోళనలు నిర్వహిం చారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగి మహారాష్ట్రలోని తడోబా ప్రాంతంలో పునరావాసం కల్పించిన గ్రామాలకు ఇక్కడి ప్రజలను తీసుకెళ్లి అవగాహన కల్పించారు. దీంతో మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కానీ అధికారులు సర్వేలు చేయడం మాత్రమే ఇప్పటి వరకు జరుగుతోంది. పునరావాసం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అటవీశాఖ అధి కారులు మాత్రం పునరావాస గ్రామాల కుటుంబాలకు పరిహారం పెంపు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని చెబుతూ వచ్చారు.కలవర పెడుతున్న పులుల సంచారంకవ్వాల్ అభయారణ్యంలో నానాటికి వన్యప్రాణుల సంచారం పెరుగు తోంది. అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిచ్చి మహారాష్ట్రలోని తడోబా అడవుల్లోంచి ఇక్కడి కవ్వాల్ అభయారణ్యానికి పెద్దపులులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల పలుచోట్ల పెద్దపులి పశువులపై దాడి చేసి చంపడం, పంటచేలకు వెళ్లిన వారికి కనిపించడంతో దట్టమైన అడ వుల్లో ఉన్న ఈ మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని చెబుతున్నారు. పునరావాసం కోసం రెండు ఆప్షన్లుకవ్వాల్ టైగర్‌జోన్‌లోని అడవిప్రాంతంలోని మైసంపేట్, రాంపూర్ గ్రా మాల ప్రజలు వారి గ్రామాల నుంచి వీడి మైదాన ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రభుత్వం వారికి రెండు ఆప్షన్‌లను కల్పించింది. ఒకటో ఆప్షన్‌లో ఒక్కో ఫ్యామిలీకి యూనిట్‌కు రూ.15 లక్షల నగదును ఇస్తే వారు ఇష్టమున్న చోటుకు వెళ్లిపోవచ్చనేది. రెండోఆప్షన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలోనే వారికి ఇళు నిర్మించి ఇవ్వడం, వ్యవసాయభూమిని కోల్పోయిన వారికి వ్యవసాయ భూమిని ఇవ్వడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం. ఈ రెండు ఆప్షన్‌లను మైసంపేట్, రాంపూర్ గ్రామాల్లోని 142 కుటుంబాల ముందుంచారు. దీంతో 48 కుటుంబాలు మొదటి ఆప్షన్‌ను ఎంచుకోగా 94 కుటుంబాలు రెండోఆప్షన్ ద్వారా పునరావాసం పొందేందుకు ఒప్పుకు న్నారు. ఇందులో భాగంగా కడెం మండలం పెద్దూర్, కొత్తమద్దిపడగ గ్రా మాల సమీపంలో 112 హెక్టార్లలో స్థలాన్నిసైతం కేటాయించారు. 2016 లోనే ఈ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు ఇప్పటి వరకు ఈ రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించకపోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పరిహారం పెంపుపై రూ.7 కోట్లు అదనపు నిధుల మంజూరుమైసంపేట, రాంపూర్ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించేందుకు మొదట ఒక కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను 142 కుటుంబాల కోసం రూ.14.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. కానీ అధికారులు పరిహారం రూ.15 లక్షలకు పెంపొందించాలని ప్రతిపాదనలు పెట్టారు. దీంతో పునరావాస ప్రక్రియ నిలిచిపోయింది. ఎట్టకేలకు తాజాగా ప్రభుత్వం పునరావాస గ్రామాల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 15 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు అదనంగా మరో రూ.7 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో అధికారులు గత నెల 22వ తేదీ నుండి రెండు గ్రామాల్లో హౌస్‌హెూల్డ్ సర్వే పూర్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో మూడుసార్లు సమావేశం నిర్వహించి ఈ పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియ ప్రా రంభించనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు పునరావాస ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పునరావాస ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలిటైగర్‌జోన్ పరిధిలోని అభయారణ్యంలో ఉన్న మా గ్రామాన్ని మైదాన ప్రాంతానికి తరలిస్తామనే ప్రతి పాదన హామీలకే పరిమితమైంది. తక్షణమే పునరావాస ప్రక్రియను పూర్తి చేసి అధికారులు మాకు అండగా నిలవాలి.– కోవ ప్రవీణ్, మైసంపేట్ గ్రామస్తుడుడిసెంబరు నెలాఖరుకు పునరావాస ప్రక్రియ పూర్తి చేస్తాంపరిహారం పెంపు ప్రక్రియపై ప్రభుత్వం నుంచి అదనంగా రూ.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రెండు గ్రామాల్లో మొత్తం 142 కుటుంబాలకు ఒక్కో కుటుంబా నికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అంద జేస్తాం. రెండు ఆప్షన్ల వారిగా ఈ పరిహారం స్వీకరించే వారిని గుర్తి స్తాం. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకు పునరావాస ప్రక్రియ పూర్తి చేస్తాం. కోటేశ్వరరావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

# మాంసం విక్రయదారుల అయిష్టత

సిరిసిల్ల : మాంసకృత్తులు.. విటమిన్లు.. కొవ్వు పదార్థాలు లభిస్తుండటంతో మాంసం వినియోగం పెరుగుతోంది. ఆదివారం, ప్రత్యేక పండగల సమయాల్లో ఇంట్లో తప్పనిసరి వంటకంగా మారుతోంది. జిల్లాలో ఏటా 11.2 టన్నుల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. అయితే మాంసం ప్రియులు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. జీవాలను వధించే చోటు, వాటిని విక్రయించే తీరులో జాగ్రత్తలు తప్పనిసరి. నిల్వ మాంసం తింటే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల ఆరోగ్య రక్షణకు శుచి, శుభ్రత, నాణ్యమైన మాంసం విక్రయించేలా సిరిసిల్ల పురపాలక సంఘాన్ని ఒక పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. రూ.5 కోట్లతో రైతు బజారులో మాంసం విక్రయాలకు ప్రత్యేకంగా దుకాణ సముదాయాలను నిర్మించింది. దీనిలో ఎన్‌ఆర్‌సీఎం (నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ మీట్) ప్రమాణాలతో రూ.12 లక్షలతో పి-మార్టు (పోర్టబుల్ మీట్ ప్రొడక్షన్ అండ్ రిటైలింగ్ ఫెసిలిటీ)ను ఏర్పాటు చేసింది. వీటిలోని పరికరాల వాడకంపై మాంసం విక్రయదారులకు శిక్షణ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. మూడేళ్లుగా తాళం తీయని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యేకత ఇలా..జీవాలను వధించడం.. వాటిని శుభ్రం చేసి, ముక్కలుగా దుకాణాల్లో విక్రయించడం అంతా శాస్త్రీయ పద్ధతిలో జరగాలి. ఐసీఎంఆర్ నిబంధనల ప్రకారం మాంసం వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించకుండా చూడాలి. దీనికోసం సిరిసిల్ల పురపాలక సంఘాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. రైతు బజారులో ప్రీక్రాప్టు పద్ధతిలో పి-మార్టును ఏర్పాటు చేసింది.

పట్టణంలోని 50 మంది మాంసం విక్రయదారులున్నారు. వీరిలో పది మందికి తొలి దశలో ఇందులోని పరికరాల వినియోగంపై ఎన్‌ఆర్‌సీఎంలో శిక్షణనిచ్చారు. జీవాలను వధించే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శరీరభాగాలు వేరు చేయడంలో సులభమైన పద్ధతులను వివరించారు. ఒకసారి పది జీవాలను ఇందులో వధించే వెసులుబాటు ఉంది. ఇక్కడ వేరు చేసిన మాంసాన్ని దుకాణాలకు తరలించి విక్రయించుకోవచ్చు. వెలువడిన వ్యర్థాలతో రెండు క్యూబిక్ సామర్థ్యం ఉన్న బయోగ్యాస్ ప్లాంటు ఉంది. ఈ గ్యాస్‌తో జీవాల తల, కాళ్లు కాల్చడానికి ఉపయోగించవచ్చు. దీనిని పూర్తిస్థాయిలో వినియోగిస్తే మాంసం మార్కెట్‌కు ఎఫ్ఎస్ఎస్ఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రం అందించే అవకాశం ఉంది.

రైతు బజారులో ఏర్పాటు చేసిన పి-మార్టు వినియోగం పెరిగితే పట్టణంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు యాభైశాతం రాయితీ రుణం అందజేసి వీటి ఏర్పాటుకు పురపాలకశాఖ సిద్ధంగా ఉంది. ఎన్‌ఆర్‌సీఎం ఉచితంగా మరో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలకశాఖ అధికారులు తెలిపారు. కానీ ఉన్న ఒక్కటీ ఉపయోగించని పరిస్థితి ఉంది.

తనిఖీలు మరిచిన అధికారులు

మార్కెట్‌లో లభించే మాంసం ఆరోగ్యకరమైనదేనా? అంటే ఆలోచించాల్సి వస్తోంది. జిల్లాలో ఎక్కడా పురపాలక, పంచాయతీల్లో వధశాలలు లేవు. వీటిని వధించే సమయంలో పశువైద్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పరీక్షించాలి. ఎలాంటి వ్యాధులు లేవని నిర్ధారించాక శుభ్రమైన మాంసం అని ముద్ర వేసిన తర్వాతే ప్రజలకు విక్రయించాలి. అయితే ఇలాంటి పరీక్షలు జిల్లాలో ఎక్కడా జరగడం లేదు. పశు వైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు కూడా లేవు. ఇదే అదనుగా జీవాలను అపరిశుభ్ర వాతావరణలో వధించడం, రోడ్ల పక్కన, కాల్వల సమీపంలో విక్రయాలు సాగించడం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం– సమ్మయ్య, కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘంపట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసం అందించేలా పి-మార్టును ఏర్పాటు చేశాం. దాని వినియోగంపై పలు మార్లు అవగాహన కల్పించాం. అయినా ముందుకు రావడం లేదు. దీనిని వినియోగించడంపై విక్రయదారులకు ఎలాంటి రుసుం ఉండదు. స్వచ్ఛందంగా ఎవరు ముందుకొచ్చినా అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

# చేపల వేటకు విరామం

బోయినపల్లి : మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలను వదులుతుంది. ఇవి పెరిగి పెద్దవి అయిన తరవాత చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు అండవిసర్జన గావించి సంతతి వృద్ధి చేసే కాలం. దీంతో రాజరాజేశ్వర, ఎగువమానేరు జలాశయాల్లో చేపల వేటను అధికారులు నిషేధించారు.జిల్లాలో బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర, గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువమానేరు జలాశయాల్లో ప్రభుత్వం చేప, రొయ్య పిల్లలను వదులుతుంది. రాజరాజేశ్వర జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల్లో ఆసక్తి ఉన్న వారికి ఇక్కడి జలాశయంలో చేపలు పట్టుకోవడానికి లైసెన్స్‌లను ప్రభుత్వం జారీ చేసింది. వీరితోపాటు జలాశయం పరిధిలో పది కిలోమీటర్ల లోపు ఉన్న మత్స్యకారులు చేపలు పట్టి విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. రెండు జలాశయాల్లో ఏటా 80 ఎం.ఎం నుంచి 100 ఎం.ఎం బరువు ఉన్న చేప పిల్లలను వదులుతున్నారు. ఇందులో కట్ల, రాహు, మృగాల రకం చేప పిల్లలు ఉంటున్నాయి. నెల రోజుల వయసు ఉన్న రొయ్య పిల్లలు వేస్తున్నారు. అయిదు నెలల కాలంలో రొయ్యలు పెరిగి మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. చేప పిల్లలు కిలో నుంచి సుమారు ఇరవై కిలోల బరువు ఉన్నవి వలలకు చిక్కుతున్నాయి. జలాశయంలో చేపల వేట కొనసాగిస్తున్న మత్స్యకారులకు నిత్యం ఉపాధి లభిస్తుంది. మత్స్యకారులతోపాటు చేపల విక్రయాలతో పలువురికి జీవనాధారం ఏర్పడింది. తాజా చేపలు లభిస్తుండటంతో రాజరాజేశ్వర జలాశయం వద్దకు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల తదితర పట్టణాల నుంచి వచ్చి చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. గత మూడేళ్లలో రెండు జలాశయాల్లో 117 లక్షల చేప పిల్లలు, 88.27 లక్షల రొయ్య పిల్లలను వదలుగా సుమారు 5,400 టన్నుల చేప, 1,403 టన్నుల రొయ్యల ఉత్పత్తి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

సంతతి అభివృద్ధి కావాలంటే...

ఏటా జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు అండ విసర్జన గావించి సంతతిని అభివృద్ధి చేయనున్నాయి. జలాశయాల్లో రెండు నెలల వరకు చేపల వేట నిలిపివేయాలని అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. సంబంధిత మత్స్య పారిశ్రామిక సంఘాలు, గ్రామ పంచాయతీలకు లేఖలు పంపారు. అయితే అధికారుల సూచనలు పాటించని కొందరు మత్స్యకారులు చాటుగా చేపల వేట కొనసాగిస్తుండటంతో చేపల ఉత్పత్తిపై ప్రభావం చూపనుంది. చేపల వేట నిలిపివేయడం వల్ల సంతతి పెరిగి ఎక్కువ చేపలు పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో మత్స్యకారులకు మరింత ఉపాధి కలగనుందని అధికారులు పేర్కొంటున్నారు.

# సిబ్బంది కొరత.. అందని సేవలు



గంగాధర : విద్యుత్తు శాఖలో కింది స్థాయి సిబ్బంది కొరతతో వానాకాలంలో రైతులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు, సాంకేతిక సమస్యలతో గృహ, పరిశ్రమలకు నిరంతర సరఫరాలో అవరోధం ఏర్పడే అవకాశముంది. విద్యుత్తు శాఖలో సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉన్నా.. సిబ్బంది కొరతతో సాధ్యం కావడం లేదు.

నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన సెక్షన్-9లో నలుగురు జూనియర్ లైన్‌మెన్లు, ఇద్దరు అసిస్టెంట్ లైన్‌మెన్లు విధులు నిర్వహించేవారు. ఇందులో ఓ జూనియర్, ఓ అసిస్టెంట్ లైన్‌మెన్ అనారోగ్య సమస్యలతో సెలవులో ఉంటే మరో జూనియర్ విధులకు హాజరు కావడంలేదంటూ ఉన్నతాధికారులకు సరెండర్ చేశారు. సెక్షన్‌లో ఇద్దరు జూనియర్, ఒక అసిస్టెంట్‌తోనే వినియోగదారులకు సేవలందిస్తున్నారు. ఒకరు పగలు, మరొకరు రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. గంగాధర సెక్షన్ పరిధిలోని గంగాధర, లక్ష్మీదేవిపల్లి, మంగపేట గ్రామాలకు ఒక హెల్పర్ మాత్రమే సేవలు అందిస్తున్నారు. సెక్షన్‌లో పని చేయాల్సిన లైన్‌మెన్ దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు. అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. ఫ్యూజ్‌పోయిన ప్రతిసారి లైన్‌మెన్లకు చెబితే తమ పరిధి కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. కురిక్యాలలో కూడా జేఎల్ఎం పోస్టు ఖాళీగా ఉంది.

నిత్యావసరం.. అంతులేని నిర్లక్ష్యం..

విద్యుత్తు వినియోగదారులకు అనుగుణంగా సేవలందించడంలో సంస్థ వెనుకబడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త పోస్టుల సంగతి పక్కన పెడితే ఉన్న వాటిని భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో 278 అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులకు 210 ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ లైన్‌మెన్ పదోన్నతుల రిజర్వేషన్ వివాదం న్యాయస్థానంలో నలుగుతోంది. తుది తీర్పు వచ్చే వరకు ఖాళీగా ఉన్న ఏఎల్ఎం పోస్టులను షరతులతో కూడిన పదోన్నతితో భర్తీ చేసే అవకాశమున్నా, ఆ దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదు.

ఉన్న వారిపై ఎక్కువ భారం

జేఎల్ఎంలు ప్రతి నెల సెక్షన్‌లో ఉన్న మూడో వంతు మీటర్లకు స్పాట్ బిల్లింగ్ చేయాలి. బకాయిలు ఉన్న వారి ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేయాలి. ఇది పరోక్షంగా రైతులకు, వినియోగదారులకు సమస్యగా మారుతోంది. ఫీడర్‌లో సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే దాన్ని పరిష్కరించే వరకు కరెంటు సరఫరా కాక రైతుల పొలాలకు నీరు అందడం లేదు. నియంత్రికల వద్ద ఫ్యూజ్ పోతే రైతులే స్వయంగా సరి చేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ఈక్రమంలో అన్నదాతలు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై విద్యుత్తు సంస్థ యాజమాన్యం దృష్టి సారించాల్సిన అవసరముంది.

# అతివకు వ్యాపార నైపుణ్యం



పెద్దపల్లి : పొదుపును అలవాటుగా చేసుకొని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ప్రభుత్వం వీరికి రుణాలు అందిస్తూ స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తోంది. అయితే కొందరు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ సద్వినియోగం చేసుకుంటుండగా, మరికొందరు వ్యవసాయ, ఇతర గృహ అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

పట్టణాలతో చూస్తే గ్రామీణ ప్రాంతాల మహిళల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటంతో ఆర్థిక ప్రగతి అంతంత మాత్రంగానే ఉంది. సంఘాల్లో దస్త్రాల నిర్వహణ, తీసుకున్న అప్పును తిరిగి చెల్లించడం, వడ్డీ లెక్కింపు, రుణాల సద్వినియోగంపై అవగాహన కొరవడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్షరాస్యత సాధించేందుకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల సంస్థ(ఎన్‌ఆర్ఎల్ఎం) ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి తెర తీసింది. బ్యాంకు రుణాలతో కనీస అవసరాలు కాకుండా వ్యాపారాభివృద్ధిలో అతివలను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ప్రతి సభ్యురాలికి చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

రుణంతో సంపాదన మార్గంగా

బ్యాంకు రుణాలతో కొందరు మాత్రమే వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగడానికి చైతన్యం పెంపొందించనున్నారు. కొత్త విధానంపై ఇటీవల మండలానికి అయిదుగురు చొప్పున వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు కరీంనగర్‌లో శిక్షణ తీసుకున్నారు. వీరు మండల స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అనంతరం గ్రామ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత, అప్పులు, ఖర్చులపై కూలంకశంగా వివరించనున్నారు. కుటుంబ అవసరాలు, వ్యవసాయ ఖర్చులకు కాకుండా బ్యాంకు రుణాన్ని సంపాదన మార్గంగా మలచుకోవడానికి మెళకువలు నేర్పించనున్నారు.

ఇదీ లక్ష్యంస్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంకర్లు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. పొదుపు ఆధారంగా విడతల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. కాగా నిరక్షరాస్యతతో సభ్యులు మోసాలకు గురవుతున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రుణాలు, పొదుపు సొమ్మును సహచర సభ్యులే పక్కదారి పట్టిస్తున్నారు. సంఘాల దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, తీసుకున్న రుణాలను చెల్లించే విధానంపై అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొందరు అవసరం లేకున్నా రుణాలు తీసుకొని దుబారా చేస్తున్నారు. అతివలు బ్యాంకు రుణాలను ప్రాథమిక అవసరాలకు కాకుండా తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు వ్యాపారాల్లో రాణించేలా చేయడమే లక్ష్యంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

15 అంశాలు యాప్‌లో నిక్షిప్తం

మహిళలు ఆర్థిక అక్షరాస్యులుగా ఎదిగేందుకు వీవోఏలు సంపూర్ణ సహకారం అందించనున్నారు. ఆర్థిక నిర్వహణపై అవగాహన, డబ్బు సంపాదన, తీసుకున్న అప్పు చెల్లించే విధానం తదితర 15 అంశాలను 'సాక్ష్యం' యాప్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఈ యాప్ ద్వారా సంఘాల సమాచారం, ఆర్థిక వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళల వివరాలపై కాకి లెక్కలకు తావుండదు.

జిల్లాలోనూ శిక్షణ తరగతులు–తిరుపతి, సెర్ప్ డీపీఎం

మహిళల ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి జిల్లా ఎంపికైంది. ముందుగా మండలానికి అయిదుగురు వీవోఏలను శిక్షణకు పంపాం. వీరంతా ఆయా మండలాల్లో అతివలను చైతన్యపరచాల్సి ఉంది. జిల్లాలోనూ శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం.

# ఉక్కపోత.. వ్యాధుల బెడద


పెద్దపల్లి : వేసవి వెళ్లినా ఉక్కపోత తగ్గలేదు. ఓవైపు వేడి వాతావరణ పరిస్థితులు, మరోవైపు ఉక్కపోతలో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎక్కువ మంది నీరసం, మధుమేహం, రక్తపోటు తదితర సమస్యల బారిన పడటంతో పాటు దగ్గు, జలుబు, జ్వరాలతో బాధ పడుతున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడంతో వివిధ రకాల సమస్యలతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. వాతావరణ పరిస్థితులతో పెద్దపల్లిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా 450 నుంచి 500 వరకు నమోదవుతోంది. ఆస్పత్రిలోని జనరల్ వార్డులో చేరే వారి(ఇన్‌పేషెంట్ల) సంఖ్య కూడా కాస్త పెరిగింది.

మొక్కుబడి పరీక్షలు

వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు బదులు సహాయకులే పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రశ్నించినా పట్టించుకునే వారే లేకపోయారు. ఆసుపత్రిలో సాధారణ సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఓపీ విభాగంలో వైద్యులు అందుబాటులో లేక రోగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సదరు వైద్యులపై రోగులకు కనీస సమాచారం అందించే వ్యవస్థ కూడా లేదు. దిగువ స్థాయి సిబ్బంది ఇచ్చిందే మాత్ర.. చేసిందే చికిత్స.. అనే పరిస్థితి నెలకొంది.

ప్రతి పనికీ ఓ ధర

ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది డబ్బు వసూలు చేయడం పరిపాటంగా మారింది. వైద్య పరీక్ష స్థాయిని బట్టి డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారి నివేదికలు తప్పుల తడకగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. గర్భిణులకు అందించే సేవల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల భారాసకు చెందిన ఓ నాయకుడి భార్య ఆస్పత్రిలో పురుడు పోసుకుంది. ఈ సందర్భంగా వారం రోజుల్లో రూ.18 వేల చేతిచమురు వదిలిందని ఆయన వాపోయాడు. ఇదే పరిస్థితి ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎదురవుతోంది. వీల్‌ఛైర్‌పై సిబ్బంది తీసుకెళ్తే రూ.500, బెడ్‌షీట్ మారిస్తే రూ.200.. ఇలా ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



ఫిర్యాదు చేస్తే చర్యలు–శ్రీధర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త

ఆస్పత్రిలో డ్యూటీ వైద్యులకు బయోమెట్రిక్ అమలు చేస్తున్నాం. ఓపీ సమయంలో బయటకు వెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు అలాంటి సమస్య మా దృష్టికి రాలేదు. రోగుల నుంచి సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నట్లు మారు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం.

# గుర్తించరేం.. కూల్చరేం..!

నల్గొండ : శిథిల భవనాలు, ఇళ్లను.. అందులో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా చూడాలని పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తగు కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. కొన్ని పురపాలికల్లో శిథిల భవనాలు సర్వే చేశారు. మరికొన్నింటిలో పురపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు.

నిండుకున్న నిర్లక్ష్యం వానాకాలం ప్రారంభమైంది. వర్షాలు కురిస్తే శిథిలమైన గూడు ఎప్పుడు కూలుతుందో తెలియదు. చిన్నపాటి వర్షాలకే పాత పునాదులు తడిసి కూలుతున్నాయి. పురపాలికల్లో అధికారుల నిర్లక్ష్యంతో పాత ప్రహరీల కింద ప్రాణాలు పోతున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో యాదగిరిగుట్టలో రెండు అంతస్తుల భవనం బాల్కని కూలి నలుగురు ప్రాణాలు విడిచినా అధికారులకు కనువిప్పు కలగడం లేదు. రుతు పవనాలు రాకముందే శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సిన పుర యంత్రాంగం ఇంకా నిర్లక్ష్యం వీడటం లేదు. కాలం తీరిన భవనాలు, ఇళ్లు గుర్తించి కూల్చాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఐదు పట్టణాల్లో సర్వే..

తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు పురపాలికల్లో మాత్రమే శిథిల భవనాలపై సర్వే చేపట్టారు. అందులో నల్గొండ-16, భువనగిరిలో 66, ఆలేరు-4, చిట్యాల-3, హాలియా-3 చొప్పున పాతపడిన భవనాలను పుర అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. నకిరేకల్ పురపాలిక శిథిలావస్థకు చెందిన పాత భవనాన్ని కూల్చకుండా స్టోరూంగా వినియోగిస్తున్నారు. దాన్ని కూల్చి వేయకుండా, పట్టణంలో శిథిల భవనాలు తొలగించకుండా జాప్యం చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో ఇంకా శిథిల భవనాల గుర్తింపు సర్వే చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

నోటీసులతో సరి..!

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని 19 పురపాలికల్లో కిందటి ఏడాది శిథిల భవనాల సర్వే చేసి 286 పాత పునాదులను కూల్చాలని పుర అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో 69 భవనాలు మాత్రమే కూల్చారు. మరో 217 శిథిల భవనాలు, ఇళ్లు కూల్చకుండా వదిలేశారు. అందులో చాలా మంది గత్యంతరం లేక పాక్షికంగా మరమ్మతులు చేయించుకుని బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు.

కూల్చివేతలు ప్రారంభిస్తాం– రమణాచారి, కమిషనర్

నల్గొండలో ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తొలి విడత 16 శిథిల భవనాలు గుర్తించి నోటీసులు జారీ చేశాం. మరో విడత సర్వే కొనసాగుతుంది. భవనాల పటిష్టతను అనుసరించి ప్రమాదకరంగా మారిన భవనాలను కూల్చివేస్తాం. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటే ఆయా ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# నవపాలిక.. ప్రగతి దీపిక

నల్గొండ : నాలుగేళ్ల క్రితం పంచాయతీలుగా ఉన్న ప్రాంతాలో కొన్ని ప్రస్తుతం పురపాలక సంఘాలుగా రూపుదాల్చి అభివృద్ధి పథంవైపు సాగుతున్నాయి.ఉమ్మడి జిల్లాలో నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, మిర్యాలగూడ పట్టణాలు పురపాలికలుగా కొనసాగేవి. వీటికి తోడు దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాలు పురపాలికలుగా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2018 ఆగస్టు 2న చిట్యాల, హాలియా, నకిరేకల్, ఆలేరు, యాదగిరిగుట్ట, తిరుమలగిరి, నేరేడుచర్ల, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు, చండూరు, నందికొండ మొత్తంగా 12 పంచాయతీలను పురపాలికలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పంచాయతీలుగా ఉన్న సమయంలో అరకొర ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే పరిమితమైన నిధులతో వీటి పాలన నిర్వహణ భారంగా ఉండేది. పురపాలికలుగా ఏర్పడిన తర్వాత ఒకేసారి ప్రజలపై భారం మోపొద్దనే ఉద్దేశంతో మూడేళ్లపాటు పంచాయతీల పన్ను విధానాన్నే అమలుచేశారు. ఇళ్లు, ఇతరత్రా నిర్మాణాలకు అనుమతి ఇవ్వడానికి 30 రోజుల సమయం నుంచి 21 రోజులకు కుదించారు. అనుమతులు ఇవ్వడానికి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఏర్పాటైంది. 'టీఎస్‌బీపాస్'ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అవసరమైన అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే, గంటల్లోపే అనుమతులు లభిస్తున్నాయి. పంచాయతీలలో అమల్లో ఉన్న జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానంలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం కింద మహిళలు, నిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి అంశాలకు సంబంధించిన అవకాశాలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఆస్తి పన్ను, ప్రచార పన్ను, నీటిపన్ను, వ్యాపార, వినోదపు పన్ను, వాణిజ్య భవనాల లైసెన్సు పన్నులతోపాటు ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, పురపాలక సంఘం గ్రాంట్స్ రూపంలో పురపాలక సంఘానికి ఆదాయం పెరిగింది. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు, వీధిదీపాల నిర్వహణ, తదితర నిర్వహణ సిబ్బంది సంఖ్య కూడా పెరిగింది. ప్రధానంగా పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, నీటి సరఫరా విషయంలో సేవలు పెరిగాయి.

ప్రధానంగా నిధులు ఇలా..తెలంగాణ పట్టణ ఆర్థిక వనరుల అభివృద్ధి సంస్థ, షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక, ప్రత్యేక అభివృద్ధి నిధులు, పట్టణ ప్రగతి కింద మంజూరయ్యే నిధులతోపాటు ఎమ్మెల్యేలు మంత్రులు, ఎంపీల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకోవడంలో చొరవచూపుతున్నారు.

పనులు సాగుతున్న తీరు

చిట్యాల: పార్కు నిర్మాణం, ఓపెన్ జిమ్, వైకుంఠధామాలు(3), సమీకృత మార్కెట్ నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్లవెంట, ప్రధాన కూడళ్లలో మొక్కల పెంపకం, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ.

నేరేడుచర్ల: సెంట్రల్ లైటింగ్, ప్రధాన రహదారుల విస్తరణ, సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం.

నకిరేకల్: ప్రధాన రహదారి విస్తరణ, సమీకృతమార్కెట్, మినీట్యాంకు బండ్, వైకుంఠధామాల నిర్మాణం.హాలియా: అంతర్గత సీసీరోడ్లు, మురుగు కాల్వలు, సమీకృత మార్కెట్, వైకుంఠధామాలు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు ప్రారంభించాల్సి ఉంది.

యాదగిరిగుట్ట: పెద్దమురుగు కాల్వ, సీసీరోడ్లు, అంతర్గత మురుగుకాల్వలు, వైకుంఠధామం, సమీకృతమార్కెట్ నిర్మాణం. ఇందులో పెద్ద మురుగుకాల్వ, కి.మీ. పొడవునా నిర్మించిన సీసీ రోడ్డు ప్రధానమైన పనులు.

ఆలేరు: సెంట్రల్ లైటింగ్, సమీకృతమార్కెట్, బైపాస్‌లో బీటీ రోడ్డు, స్ట్రామ్ వాటర్ కాల్వలు, సీసీరోడ్లు, ప్రధాన, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం.అభివృద్ధి పైనే దృష్టి.– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల పురపాలికల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రానున్న కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ప్రధానంగా దృష్టి సారించాను.

# పాఠశాలలకు పైసలొచ్చాయ్...

కొత్తగూడెం : సర్కారు బడుల నిర్వహణకు ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిధులు మంజూరవటంతో సమస్యలు తీరినట్లు అయ్యింది. గతేడాది మధ్యలో, చివరన 50 శాతం చొప్పున రెండు దఫాలుగా నిధులు అందాయి. ఈ ఏడాది ఆరంభంలోనే 50 శాతం నిధులను ప్రభుత్వం మంజూరు చేయటం గమనార్హం. పాఠశాలల నిర్వహణతో పాటు క్రీడలకు సైతం నిధులు వేర్వేరుగా విడుదల చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సర్కారు బడుల ఖాతాల్లో మొత్తమ్మీద రూ.3,11,10,500 జమ కానున్నాయి.

**ఈసారి త్వరగా..** గతంలో పాఠశాలలకు సకాలంలో నిధులు విడుదల కాకపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విద్యుత్తు బిల్లులు, దస్తరు, సుద్ద ముక్కలు, తెల్ల కాగితాలు, హాజరు పట్టికలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ప్రొజెక్టర్ల నిర్వహణ తదితర సామగ్రి కొంటారు. పరీక్షలు, జాతీయ పండగల నిర్వహణ,



ప్రయోగశాలలకు పరికరాలు సమకూర్చుతారు. డిజిటల్ తరగతులు, గదుల్లో విద్యుద్దీపాలు, గాలిపంకాల మరమ్మతులు తదితర వాటికి కార్యాచరణ రూపొందించుకోవాలి. ఇటీవల చేపట్టిన బాడిబాట ఖర్చులు తొలిదశలో సకాలంలో విడుదలవటంతో ఊపిరి పీల్చుకున్నారు. క్రీడలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలలకు..: రూ.5వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10వేల చొప్పున మంజూరయ్యాయి. పాఠశాల గ్రాంట్లు, క్రీడల తొలి దఫా నిధులు వచ్చాయి. వాటిని ప్రధానోపాధ్యాయులు వినియోగించుకోవాలి. సమస్యలకు అనుగుణంగా ఖర్చు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయటం శుభపరిణామం. సోమశేఖరశర్మ, డీఈఓ

# ఆశ్రమం.. ప్రమాదకరం..

ములుగు : వెంకటాపురం మండలం చిరుతపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సమస్యలు వేదిస్తున్నాయి. మూడు నుంచి పది తరగతులకు చెందిన 125 మంది విద్యార్థులు అభ్యసిస్తూ వసతి పొందుతున్న ఆశ్రమంలో సౌకర్యాల లేమి, ఉపాధ్యాయుల కొరత భావిపౌరులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దశాబ్దాల నాటి శిథిల భవనంలో భయం గుప్పిట్లో సహవాసం చేయాల్సిన దయనీయ స్థితి నెలకొంది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే సదుపాయాలను కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గిరిజన బిడ్డలకు కష్టాలు తప్పడం లేదు.

**వెక్కిరిస్తున్న ఇంజినీర్ల ప్రణాళిక!**

ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారుల ప్రణాళిక వెక్కిరిస్తోంది. రూ.కోట్లలో నిధుల కేటాయిస్తున్నా అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, ఉద్యోగులకు శాపంగా మారాయి. 20018-19 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆశ్రమానికి రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో భవనాన్ని మంజూరు చేశారు. నిర్మాణంలో కాలాతీతం, అధికారుల నిర్లక్ష్యం, సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ఆ భవనం పై అంతస్తు అసంపూర్తిగా ఉంది. ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే గతేడాది రూ.10 లక్షల నిధులను మరమ్మతుల పేరుతో మంజూరు చేశారు. ఆ నిధులు ఎందుకూ సరిపోకపోవడంతో అసంపూర్తి భవనం పనులకు బదలాయించారు. అరకొరగానే నిర్మాణాలు సాగుతున్నాయి. పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు, పనులు చేస్తేనే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండనుంది.

**అవస్థలు వర్ణనాతీతం**

గిరిజన బిడ్డల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. 1986లో నిర్మించిన వసతి భవనం శిథిలావస్థకు చేరింది. గదులన్నీ పెచ్చులూడి



ప్రమాదకరంగా మారాయి. ఈ భవనానికి చెందిన విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా ఉండటం, వర్షానికి పైకప్పు, గోడలు తడుస్తుండటంతో కరెంటు సరఫరా అవుతోంది. ఇటీవల షార్టుసర్క్యూట్ సమస్యలు తలెత్తి మంటలు వ్యాపించగా, శుద్ధిజలం ప్లాంటు గదిలోకి వెళ్లిన సిబ్బందికి ప్రమాదం తప్పింది. ్రత్రశాలలు, మరుగుదొడ్లకు చెందిన పైపులు ధ్వంసమై నీటి సరఫరా ఎక్కడికక్కడ నిలుస్తోంది. నీటి సమస్య ఏర్పడింది. నల్లాలకు సైతం ట్యాపులు లేకపోవడంతో విద్యార్థులు కష్టాలు పడాల్సి వస్తోంది.

**భయంతో గడుపుతున్నాం**

అసౌకర్యాలతో తిప్పలు పడుతున్నాం. భవనానికి విద్యుత్తు సరఫరా అవుతుండటంతో భయం భయంగా గడుపుతున్నాం. వర్షం పడితే లీకులతో గదులు తడుస్తున్నాయి. సామగ్రి భద్రపరుచుకోవడం కష్టంగానే ఉంది. ఏళ్లుగా ఇవే అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదు.

**వసతి,చదువు ఒకేచోట కల్పించాలి**

చదువులు ఓ చోట, వసతి మరో చోట ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. రోజుకు నాలుగు దఫాల పావు కి.మీ దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. గ్రామం నుంచి వెళుతుండటంతో రక్షణ లేని పరిస్థితి ఉంది. ఆశ్రమ పాఠశాల కొనసాగిస్తున్న ప్రాంగణంలోనే వసతి కల్పిస్తేనే ఇబ్బందులు తొలగనున్నాయి.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

**సపక నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు**

ఆశ్రమ పాఠశాల, వసతి భవనంలో అవస్థలను ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్య తీవ్రంగానే ఉండటంతో తాము కష్టాలు పడాల్సి వస్తోంది. వసతి భవనం నుంచి పాఠశాల భవనం వద్దకు రోజూ విద్యార్థులను తీసుకెళ్లడం, మళ్లీ చేర్చడం సమస్యగా ఉంది. శిథిలావస్థకు చేరిన భవనంలో ఉండటం అపాయంగా ఉన్నట్లు అధికారులకు విన్నవించాం. ప్రస్తుతం పాఠశాల నిర్వహిస్తున్న ప్రాంగణంలోనే వంటశాల, పై అంతస్తులో విద్యార్థులకు వసతి కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉండనుంది.

# తుది సర్వేకు సన్నాహాలు




ఖమ్మం : డోర్నకల్- మిర్యాలగూడ రైల్వేలైన్ తుది సర్వే(రీ సర్వే) త్వరలో ప్రారంభం కానుంది. కొన్ని నెలల క్రితం రఘునాథపాలెం, ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో ఓ ప్రైవేట్ సంస్థ ప్రాథమిక సర్వే జరిపిన విషయం తెలిసిందే. ఖమ్మం గ్రామీణ మండలంలో స్థానికులు సర్వేను అడ్డుకున్నారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సర్వేను త్వరగా పూర్తిచేసి దక్షిణ మధ్య రైల్వేకు డీపీఆర్ సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలు, సహా జిల్లా వ్యాప్తంగా తుది సర్వేకు పూనుకోవాలని కలెక్టర్‌కు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇటీవల సూచించారు.

**స్వరూపమిదీ..**

ప్రతిపాదిత డోర్నకల్-మిర్యాలగూడ బ్రాడ్‌గేజ్‌ను విజయవాడ-కాజీపేట మార్గంలోని పాపటపల్లి నుంచి మోటమర్రి- విష్ణుపురం నడుమ ఉన్న జాన్‌పహాడ్ రైల్వేస్టేషన్‌కు అనుసంధానించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు యాదాద్రి థర్మల్ విద్యుచ్ఛక్తి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా కోసం ఈ లైన్‌ను రూపొందించారు. మోటమర్రి నుంచి విష్ణుపురం మార్గం ద్వారా బొగ్గును 150 కి.మీ రవాణా చేయాల్సి వస్తోంది. నూతన మార్గం ద్వారా సుమారు 50 కి.మీ మేర దూరభారం, రవాణా వ్యయం తగ్గనుంది. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో గ్రానైట్, ఇనుప ఖనిజం, చెరకు రవాణా తదితర అవసరాలకూ ఉపయోగపడేలా ఈ రైల్వే లైన్‌ను రూపొందించారు. ఈ మార్గంలో ఆర్ఈటీ సర్వే ఇప్పటికే ముగిసింది. ఫైనల్ లొకేషన్ సర్వే సూర్యాపేట జిల్లాలో ముగియగా ఖమ్మం జిల్లాలో పూర్తవ్వాల్సి ఉంది. ఈ సర్వేపై స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి రైల్వే శాఖకు వినతులందాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని తుది సర్వే చేపట్టనున్నారు.

**మార్గమిదే..**

ఖమ్మం గ్రామీణం మండలం జాన్‌బాద్‌తండా, దారేడు, గుండాలతండా, గూడూరుపాడు, ఎం.వెంకటాయపాలెం, ఆరెకోడు, ఆరెంపుల, బారుగూడెం, పొన్నెకల్లు, మద్దులపల్లి, తెల్దారుపల్లి మీదుగా ముదిగొండ మండలం లక్ష్మీపురం, మేడేపల్లి, ధనియాలగూడెం, కట్టకూరు, నేలకొండపల్లి మండలం ఆరెగూడెం, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, నేలకొండపల్లి, బోదులబండ, పైనంపల్లి గ్రామాలను కలుపుతూ కోదాడ, హుజుర్‌నగర్ వరకూ కొనసాగనుంది. దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద బౌద్ధమహాస్తూపం, భక్తరామదాసు ధ్యానమందిరం వంటి చారిత్రక ప్రాంతాలుండటంతో నేలకొండపల్లిలో హాల్టింగ్ స్టేషన్ ఏర్పాటుచేయనున్నారు. ఈ గ్రామాల్లో సింగల్ లైన్ కోసం 8మీటర్ల భూమి సేకరించనున్నారు. ఒకవేళ డబ్లింగ్‌కూ ఇప్పుడే సేకరించాలని రైల్వే భావిస్తే 15 మీ మేర భూమి అవసరమవుతుంది. మొత్తమ్మీద 93 కి.మీ.కు సూర్యాపేట జిల్లాలోని 50 కి.మీ. సర్వే నాలుగు నెలల క్రితమే పూర్తయ్యింది.

ఈ రైల్వే ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. బొగ్గు రవాణా కోసం రూపకల్పన చేసినా భవిష్యత్తులో ప్యాసింజర్ రైళ్లు నడిస్తే రెండు జిల్లాలకు ఉపయుక్తంగా ఉంటుంది. స్థానికులు సహకరించి రైల్వే ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములవ్వాలి. ప్రతి వినతిని పరిగణనలోకి తీసుకుంటున్నాం. నష్టపరిహారం తదితర అంశాల్లో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సముచిత న్యాయం చేస్తున్నాం.

కుందు రామారావు, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్) ద.మ రైల్వే, గుంటూరు

# చదువు చింత తీర్చే సార్వత్రిక విద్య



ఖమ్మం : వివిధ కారణాలతో బాల్యంలో చదువుకు దూరమైన వారు ఎందరో ఉన్నారు. ఉద్యోగాలు, ఇతర పనులు చేసుకుంటూ కొందరు.. సంసార బాధ్యతలకు పరిమితమైన గృహిణులకు నేడు 'సార్వత్రిక విద్య' మంచి అవకాశంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) 2023-24 విద్యా సంవత్సరానికి ఈ నెల 10 నుంచి ఆగస్టు 10 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 'టాస్' వెబ్‌సైట్‌తో పాటు మీసేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

ఉభయ జిల్లాలో మొత్తం 46 అధ్యయన కేంద్రాలున్నాయి. పదో తరగతికి 14 ఏళ్లు, ఇంటర్మీడియట్‌కు 15 ఏళ్లు నిండినవారు, బడి మధ్యలో మానేసిన వారు ప్రవేశాలు పొందేందుకు అర్హులు. బోధన తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ మాధ్యమాల్లో జరుగుతుంది. ఆర్థిక, సామాజిక కారణాలతో బాల్యంలో చదువుకు దూరమైన వారు.. పాఠశాల స్థాయిలో కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియట్ మధ్యలో నిలిపివేసిన వారు ప్రవేశాలు పొందొచ్చు. గ్రామీణ ప్రాంతాల వారు, ఉద్యోగులు, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తూనే ఖాళీ సమయాల్లో చదువుకోవచ్చు. పదో తరగతికి రూ.1,150, ఇంటర్మీడియట్‌కు రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వృత్తి విద్య కోర్సులు ఐచ్ఛిక సబ్జెక్టుగా ఎంపిక చేసుకునే అవకాశం కూడా ఉంది.

**అవకాశం సద్వినియోగం చేసుకోవాలి - మద్దినేని పాపారావు, కోఆర్డినేటర్, ఉమ్మడి ఖమ్మం**

ఓపెన్ స్కూల్ ద్వారా విద్యార్హతలు పెంపొందించుకునేందుకు వేలాది మంది అభ్యర్థులు ముందుకొస్తున్నారు. చదువు మధ్యలో మానేసిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గలవారు అందుబాటులో ఉన్న సమీప అధ్యయన కేంద్రాల నిర్వాహకులను సంప్రదించాలి. ధ్రువపత్రాలకు రెగ్యులర్ కోర్సులతో సమానంగా ప్రాధాన్యం ఉంటుంది.

# వరద ముప్పు నివారణకు చర్యలు

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో ఏటా వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరదలు సంభవించి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఐదేళ్లుగా ఆదర్శనగర్, అయిలాపూర్, ప్రకాశం రోడ్, ఝాన్సీరోడ్‌లోని కాలనీలు పూర్తిగా నీట మునిగి ప్రజలు రోజుల తరబడి ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయి. వరదలు తగ్గుముఖం పట్టే వరకు బాధిత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అతిభారీ వరదల వల్ల రెండేళ్లుగా ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎలాగైనా ప్రస్తుత వర్షాకాలంలో కోరుట్ల పట్టణంలో వరదల నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ పాలకులు ముందస్తు చర్యలు చేపట్టారు.

**గొలుసుకట్టు కాలువల ఆక్రమణ**

ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నుంచి మాటు కాలువ ద్వారా నీరు పట్టణ శివారులోని కంచరకుంటలోకి చేరుతుంది. కంచరకుంట నిండిన తర్వాత దాని కిందున్న వ్యవసాయ భూములకు, కోరుట్ల, తిమ్మాయిపల్లె, అయిలాపూర్‌లోని చెరువులను నింపేందుకు ప్రత్యేక కాలువలుండేవి. 20 ఏళ్ల క్రితం కంచరకుంట తూంను మట్టితో నింపేసి, కిందున్న కాలువలను చుట్టు పక్కల రైతులు పూర్తిగా ఆక్రమించుకుని పంటలు, మామిడితోటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఏటా వర్షాకాలంలో కంచరకుంట పూర్తిగా నిండిన తర్వాత తూం తెరిచి కాలువ ద్వారా కింది ప్రాంతానికి నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులో ఎక్కువైన నీరు మత్తడి దూకి ఆదర్శనగర్‌లోని కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయి. అక్కడి నుంచి వరద నీరు మద్దుల చెరువులో చేరి అక్కడి నుంచి వెలువడ్డ వరద నీరు కింది ప్రాంతంలోని కాలువ ద్వారా ఫుల్‌వాగులో కలుస్తుండేవి కానీ.. మద్దుల చెరువు కిందున్న కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవడంతో కాలువ విస్తీర్ణం కుచించుకుపోయింది. దీంతో చెరువు మత్తడి నుంచి వెలువడ్డ వరద నీరు పోయేందుకు సరైన కాలువ లేకపోవడంతో అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్, ఝాన్సీరోడ్, కల్లూర్‌రోడ్‌లను ముంచెత్తుతున్నాయి.


**కాలువ తవ్వకంతో..**



ఏటా వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో సంభవించే వరద ముప్పు నివారణ కోసం ప్రజాప్రతినిధులు, మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కంచరకుంటలో పేరుకుపోయిన పూడిక, తూంను కప్పేసిన మట్టిని తొలగించారు. కంచరకుంట తూం కింద ఆక్రమణకు గురైన గొలుసుకట్టు కాలువను సుమారు 1.5 కిలో మీటర్ల మేర పూర్తిగా తవ్వించారు. తూం కాలువ ద్వారా వెలువడే వరద నీటిని ఎస్సారెస్పీ మినీ కాలువలో అనుసంధానం చేసి రైతుల సాగుకు ఉపయోగపడేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు తూం మాటు కాలువ ద్వారా వచ్చే నీటితోనే పట్టణంలో వరదల ముప్పునకు ఎక్కువ కారణమవుతున్నాయని మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇటీవల కమిషనర్ అయాజ్, డీఈఈ అభినయ్‌కుమార్, ఏఈ సిరాజ్‌లు కాలువ వెంబడి తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో కాలువలో నీటి విడుదలను తూం మూసివేసి నిలిపివేస్తే వరదలను నివారించవచ్చని తేల్చారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దెబ్బతిన్న కాలువ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల సమయంలో స్తంభాల చెరువు కాలువను మూసివేసి, కంచరకుంట తూంను తెరిచి కాలువ ద్వారా కింది ప్రాంతానికి నీటిని విడుదల చేసి పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వరదలను తగ్గించేలా ప్రత్యేక చర్యలను అమలు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమైనట్లు కమిషనర్ అయాజ్ పేర్కొన్నారు.

# జీరో విస్తీర్ణంతో పోడు పట్టాలు జారీ..!

కొత్తగూడ : ప్రభుత్వం గిరిజన పోడు రైతులకు జారీ చేసిన పట్టా పుస్తకాల్లో కొన్ని విస్తీర్ణం లేకుండా జారీ అయ్యాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. గిరిజన పోడు రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన అనంతరం పాతపోడు అని గుర్తించి పట్టాలు జారీ చేసినప్పటికీ పలువురికి జీరో విస్తీర్ణంతో పోడు పట్టాల పుస్తకాలు జారీ కావడంతో వారు ఆవేదన చెందుతున్నారు. కొత్తగూడ మండలం ముస్మీ గ్రామానికి చెందిన కల్తీ ఎర్రక్క నాలుగెకరాల పోడు భూమి సర్వే నిర్వహించి అధికారులు పరిశీలించినప్పటికీ మంగళవారం జారీ చేసిన పుస్తకంలో జీరో విస్తీర్ణం ఉండడంతో అవాక్కయ్యారు. పలు గ్రామాలకు చెందిన రైతులకు కూడా జీరో విస్తీర్ణంతో పోడు పట్టాలు జారీ అయినట్లు స్థానికులు చెప్పారు. ఐదారెకరాలకు దరఖాస్తు చేసుకుంటే పది, ఇరవై గుంటలకు మాత్రమే పోడు పట్టా వచ్చినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముస్మీ గ్రామానికి చెందిన కొందరి రైతులకు పదెకరాలకు పైగా పోడు పట్టా పుస్తకం జారీ కావడంతో ఇది గుర్తించిన పాసు పుస్తకాలు ఆయా పోడు రైతులకు ఇవ్వకుండా నిలిపేసినట్లు తెలిసింది. నిబంధనల




మేరకు ఒక్క రైతుకు పదెకరాల వరకు మాత్రమే హక్కుపత్రం జారీ చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ కొందరికి పదెకరాల విస్తీర్ణం దాటి పుస్తకాలు జారీ కావడంతో వీటిని రైతులకు ఇవ్వకుండా ఆపినట్లు సమాచారం.

**సున్నా విస్తీర్ణంతో ఇస్తారా?**

**ఎర్రక్క, ముస్మీ**

నాలుగెకరాల భూమికి సర్వే జరిగినప్పటికీ సున్నా ఎకరాలతో పుస్తకం వచ్చింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లా. ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేస్తానని చెప్పారు. అధికారులంతా వచ్చి మా పోడు భూమిని సర్వే కూడా చేశారు.

**నాలుగెకరాలకు.. 20 గుంటలే ఇచ్చారు**

**భూక్య వినోద, ముస్మీ**

లుగెకరాల భూమి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్నా. అధికారులు సర్వేలు నిర్వహించి భూమిని కొలిచారు. పాతపోడుభూమి అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఇప్పుడు పుస్తకంలో 20 గుంటల విస్తీర్ణమే ఉంది. అధికారులను అడిగితే మాకు తెలియదని దాటవేస్తున్నారు. కొందరికి ఉన్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణంతో పుస్తకాలు వచ్చాయి. ఇది ఎలా ఇచ్చారో తెలియడం లేదు.

# భగీరథ నీరెలా..?

కొత్తగూడ : గణప సముద్రం చెరువు గతేడాది ఈ నెలలో నిండి మత్తడి పోసింది. ఈ సారి వర్షాభావ పరిస్థితి తలెత్తింది.. రైతులంతా దుక్కులు దున్ని నాట్లు వేసే సమయంలో గణప సముద్రం అడుగంటిపోయి కనిపిస్తోంది. ఇక నియోజకవర్గానికి మిషన్ భగీరథ తాగునీరు అందించే గణప సముద్రంలో ఇన్‌టెక్‌వెల్ వద్ద నీరు అరకొరగానే ఉంది. ఇందులో నడిచే రెండు మోటార్లకు సరిపడా నీరందడం లేదని ఆపరేటర్లు చెబుతున్నారు. గతేడాది చెరువులోని నీరంతా ఆయకట్ట పంట పొలాలకు వదిలారు. సుమారు నాలుగు వేల ఎకరాల్లో రెండు పంటలు పండాయి. ఇప్పుడు నీటికి కటకట ఏర్పడడంతో దేవాదుల నీటితో గణపసముద్రం నింపే ప్రయత్నం చేస్తున్నారు. దేవాదుల నుంచి రామప్ప సరస్సులోకి జలాలు వదిలితే ఆ నీరు గణపురం మండలం బుద్దారం వంగపల్లివాణి చెరువులోకి వస్తుంది. ఆ చెరువు నిండాక మత్తడి పడితే నీరు గణప సముద్రంలోకి వెళ్తుంది. పది రోజుల క్రితం అధికారులు నీటిని వదలగా వంగపల్లి చెరువు మత్తడి పడి నీరు గణప సముద్రంలోకి చేరింది. అయితే రైతులు గ్రావిటీ కెనాల్‌లో విద్యుత్తు మోటార్లను అమర్చుకొని నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. గణప సముద్రంలోకి వెళ్లే నీటిని కొందరు రైతులు దారి మళ్లిస్తూ అక్రమంగా పంటలను సాగు చేసుకుంటున్నారు. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. రామప్ప సరస్సు నుంచి వస్తున్న నీరు అనుకున్న స్థాయిలో గణప సముద్రంలోకి చేరకపోవడంతో చెరువు రోజురోజుకు అడుగంటుతోంది. ఈ కాల్వలో విపరీతమైన తుంగ పెరిగి ప్రవహించే నీటికి అడ్డుపడుతున్నాయి. నీటి పారుదల అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు చెబుతున్నారు.

**వర్షాలు లేకపోతే ఎలా..?** ప్రస్తుత వర్షాకాలం ఆశించిన స్థాయిలో లేదు. ఇప్పటిదాకా ఒక భారీ వర్షం కూడా లేదు. దీంతో చెరువులోకి కొత్తనీరు రావడం లేదు. ఒక వేళ వర్షాలు సరిగా పడకపోతే మిషన్ భగీరథ ఆగిపోయే పరిస్థితి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

**తక్షణమే..** గ్రావిటీ కెనాల్‌లో తుంగను తీసేసి మోటార్లను తొలగించాలని ఓ భగీరథ అధికారి తెలిపారు. రామప్ప సరస్సు నుంచి ఇంకా కొంచెం ఎక్కువ మోతాదులో నీటిని వదలాలని పేర్కొన్నారు. లేకుంటే నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఆ అధికారి పేర్కొన్నారు. కాల్వను పరిశీలిస్తాం. గ్రావిటీ కెనాల్‌ను పరిశీలించి తుంగను తొలగిస్తాం. అక్రమ మోటార్లను తొలగిస్తాం.. నీటి చౌర్యం జరగకుండా చూస్తాం. సజావుగా గణప సముద్రంలోకి నీరు ప్రవహించేలా చేసి మిషన్ భగీరథ ఆగకుండా చూస్తాం. ఎవరైనా అక్రమంగా నీటి చౌర్యానికి పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తాం. వెంకటేశ్వర్లు, ఐబీ ఈఈ, భూపాలపల్లి

# దారిలేని దైన్యం.. వైద్యసేవలు మృగ్యం

ఆసిఫాబాద్ : భారీ వర్షాలకు కోతకు గురైన రోడ్లు కాబోయే అమ్మలకు కడుపుకోతను మిగిల్చుతున్నాయి. కొట్టుకుపోయిన కల్వర్టులు ప్రసవాన్ని ప్రాణాంతకం చేస్తున్నాయి. మరమ్మతుల్లో నెలకొన్న జాప్యం పసి ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణి, పచ్చిబాలింత సైతం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన దుస్థితి జిల్లాలో నెలకొంది. ఈక్రమంలో మార్గమధ్యలోనే వీరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రహదారులు, కల్వర్టులు తెగిపోయి పక్షం రోజులు గడుస్తున్నా ఎక్కడా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. వర్షాలు అప్పుడప్పుడు తెరిపినిస్తున్నా, రోడ్లను, కల్వర్టులను బాగు చేసే పనులేవి జిజిల్లాలో ప్రారంభం కాలేదు.రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం జిల్లాలో నమోదైంది. ఈ నేపథ్యంలో వాగులు, నదులు ఉగ్రరూపం దాల్చడంతో ఆయా గ్రామాల్లో ఉండే ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. జిల్లాలో లోలెవల్ కల్వర్టులు వరదల తాకిడికి ధ్వంసమయ్యాయి. ద్విచక్రవాహనం సైతం వెళ్లలేని విధంగా మారాయి. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 26 రోడ్లు దెబ్బతినగా, మరమ్మతుల కోసం రూ. 1.93 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాలు రూపొందించారు. ఆర్అండ్‌బీ శాఖ నుంచి 24 రహదారుల మరమ్మతులకు రూ. 82 లక్షలతో పాటు 22 కల్వర్టులు, వంతెనలు నిర్మించడానికి రూ. 49 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు చేశారు.

నిధులు లేక.. పనులు సాగక

మరమ్మతులకు అవసరమైన నిధుల కేటాయింపులేవీ జిల్లాకు లేకపోవడం వల్ల ఒక్క పనిని సైతం చేపట్టలేదని అధికారులు అంటున్నారు. పగిలిన, కోతకు గురైన రోడ్లు, కల్వర్టులను అతికష్టం మీద ప్రజలు దాటుతున్నారు. ఈ తరుణంలో స్థానిక నాయకులు, నేతలు చిన్నపాటి మరమ్మతులైనా చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అధికారులు ఏమంటున్నారంటే..: మరమ్మతుల గురించి ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న, పీఆర్ ఈఈ రాంమోహన్‌రావు మాట్లాడుతూ.. నిధులు విడుదల కాగానే మరమ్మతుల పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

ఆపత్కాలం.. ముందుకు వెళ్లలేం..

బెజ్జూర్ మండలం నాగేపల్లికి చెందిన కొడప మల్లుబాయికి ఈ నెల 21న పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. బెజ్జూర్ పీహెచ్‌సీకి బయలుదేరగా మార్గమధ్యలో సుశ్మీర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మరోమార్గం చింతలమానేపల్లి మండలం గూడెం మీదుగా బెజ్జూరుకు వెళ్దామని ఆటోలో బయల్దేరారు. కోయపల్లి వద్ద కల్వర్టు కోతకు గురికావడంతో అక్కడి నుంచి ముందుకు వెళ్లలేకపోయారు. ఈక్రమంలో మల్లుబాయి కల్వర్టుపైనే ప్రసవించింది. రెండురోజుల అనంతరం బిడ్డ మృత్యువాత పడ్డాడు.

మరమ్మతులు ఎప్పుడు చేస్తారో?

కెరమెరి మండలంలోని కర్నెతగూడ వెళ్లడానికి చిన్న కాలువను దాటాల్సి ఉంటుంది. వరదలకు కల్వర్టు కొట్టుకుపోయింది. ప్రస్తుతం గ్రామస్థులు ఈ కాలువను దాటడానికి నానాపాట్లు పడుతున్నారు. కనీస మరమ్మతులు కూడా కరవయ్యాయి.

తల్లీబిడ్డలకు తప్పిన ముప్పు..

బెజ్జూరు మండలం కమ్మర్‌గాం గ్రామ పంచాయతీ నందిగాం గ్రామానికి చెందిన తలండి సులోచన బుధవారం ఇంటి దగ్గర ప్రసవమైంది. పండంటి బాబు పుట్టాడు. తల్లి, బిడ్డలకు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి వచ్చింది. రోడ్డేమో బాగోలేదు.. వాహనాలు సైతం నడవలేని పరిస్థితిలో పంచాయతీ ట్రాక్టరులో తరలించాల్సి వచ్చింది. అస్తవ్యస్తంగా ఉన్న దారిలో ఓ చోట ధ్వంసమైన కల్వర్టు ఉంది. కొంచెం అటు ఇటు అయినా ప్రాణాలు గల్లంతే. స్థానికుల సాయంతో ట్రాక్టరును కల్వర్టు దాటించి బెజ్జూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సుంకన్న వారిని పరీక్షించి తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. 3రోజుల తర్వాత ఇంటికి పంపిస్తామన్నారు.

బురదలో కూరుకుపోయిన అంబులెన్సు

ఎంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడ రోడ్డులో కాలినడక కూడా కష్టమే. బుధవారం గ్రామానికి చెందిన నలుగురు గర్భిణులను స్థానిక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు 102 వాహనంలో బయల్దేరగా.. బొక్కివాగు వంతెన సమీపంలో వాహనం బురదలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని అతికష్టం మీద వాహనాన్ని బయటికి నెట్టారు. దీంతో గర్భిణులు కొద్దిదూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని బాగు చేయాలని వారు వేడుకుంటున్నారు.

# బజారుకెళితే భరించాల్సిందే!

ఆసిఫాబాద్ : జిల్లాలోని పట్టణాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడం కష్టంగా మారింది. సరిపడా ప్రజా మరుగుదొడ్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. సమీపంలో మూత్రశాలలు లేకపోవడంతో కొందరు ఎక్కడో సందు చూసుకుని కానిచ్చేస్తున్నారు. మహిళల బాధ మాత్రం వర్ణనాతీతం. తిరిగి ఇంటికి వెళ్లేదాకా భరించక తప్పడం లేదు. దీంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉన్నా అన్ని మున్సిపాలిటీల్లో ఆ సదుపాయం లేదు. పట్టణ ప్రగతి కింద పాత ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి, వాటిలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా అధునాతన మరుగుదొడ్లు, మూత్రశాలల సదుపాయాన్ని కల్పించాల్సి ఉంది. ఆదిలాబాద్, మంచిర్యాల, కాగజ్‌నగర్ పురపాలికలను మినహాయిస్తే ఇతర చోట్ల బయో టాయిలెట్ సదుపాయం అందుబాటులో లేదు. అయితే బస్సు లోపలి మరుగుదొడ్లను వినియోగించేందుకు ప్రజలు అంతగా ఆసక్తి కనబర్చడం లేదు.అవసరమైన చోట లేకస్వచ్ఛభారత్ మార్గదర్శకాల ప్రకారం పురపాలికల్లో ప్రతి వేయి జనాభాకు ఒక మరుగుదొడ్డి(సీటు) చొప్పున అందుబాటులో ఉండాలి. లక్ష జనాభాకు 100 సీట్లు అందులో స్త్రీ, పురుషులకు 50 చొప్పున ఉండాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం నిత్యం వేలాది మంది పట్టణాలకు షాపింగ్ కోసం వస్తుంటారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలోని చాలా పురపాలికల్లో సరిపడా సదుపాయాలు లేవు. జనసంచారం ఎక్కువగా ఉండే చోట మరుగుదొడ్ల అవసరాలు ఎక్కువగా ఉంటాయి. అయితే పట్టణాల్లో జనాలు ఎక్కువగా తిరిగే చోట మూత్రశాలల నిర్మాణానికి స్థలాలు లేకపోవడం సమస్యగా మారింది. బీఓటీ(బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిన నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణను కొందరు ప్రైవేటు సిబ్బందికి అప్పగించారు. మరుగుదొడ్డి వినియోగించిన వారి నుంచి రూ. 5 మాత్రమే తీసుకోవాల్సి ఉండగా రూ. 10 వరకు వసూలు చేస్తున్నా శుభ్రతా చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా బల్దియా పాలకవర్గాలు ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్డి, మూత్రశాలల వసతులు కల్పించాల్సి ఉంది.

# పట్టించుకుంటేనే పట్టిక అమలు



మంచిర్యాల : ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటీవల పలు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో ఇప్పటికే విటమిన్లు (పోషకాలు) కలిపిన బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు వారంలో మూడురోజులు కచ్చితంగా గుడ్డును వడ్డించేందుకు గుడ్డు ధరను రూ. 5 కు పెంచారు. ఇన్నిచేసినా పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పట్టిక పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పరిశుభ్రమైన వాతావరణంలో ఈ పథకం అమలు చేయాలని, ప్రతిబడిలో మధ్యాహ్న భోజనం పట్టిక వివరాలను గోడపై రాయించాలని ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం ఆదేశాలను జారీచేసింది. నాణ్యత పాటిస్తూ వారంలో మూడు సార్లు ఉడికించిన కోడిగుడ్డును విద్యార్థులకు విధిగా అందించాలని సూచించింది. దీనిపై వంట ఏజెన్సీల నుంచి రాత పూర్వకంగా ఒప్పంద పత్రాన్ని తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. భోజనం వండిన తరువాత ప్రధానోపాధ్యాయుడు, లేదా ఉపాధ్యాయుడు రుచి చూసిన తరువాతనే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించింది. భోజనం చేసిన విద్యార్థుల సంఖ్య, గుడ్డు తీసుకున్నవారి వివరాలను ఎండీఎం మొబైల్ యాప్‌లో పొందుపర్చాలని పేర్కొన్నారు.

మార్గదర్శకాల అమల్లో లోపాలు

కోడిగుడ్డు ధర పెంచినప్పటికీ పలు పాఠశాలల్లో వారంలో రెండు రోజులు, కొన్ని చోట్ల గుడ్డుకు బదులు అరటిపండుతో సరిపెడుతున్నారు. గుడ్డు ధర బయటి మార్కెట్‌లో రూ. 6కు పెరగడంతో పట్టిక అమలు కష్టంగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికీ పలు పాఠశాలల్లో పట్టిక సక్రమంగా పాటించడం లేదు. నూతన మార్గదర్శకాలు అమలు చేయడంలేదు. పట్టిక బోర్డుల్లో కొన్ని చోట్ల స్పష్టత లేకుండా ఉన్నాయి.

నిబంధనలు ఇలా.. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో మధ్యాహ్న భోజన కమిటీ ఏర్పాటు చేయాలి.వంట ఏజెన్సీకి బియ్యంతోపాటు ఇతర సరకులు విద్యార్థుల కమిటీ సమక్షంలో తూకం వేసి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి.అధికారుల తనిఖీల్లో రిజిస్టర్ వివరాలు, పాఠశాలల్లో నిల్వల్లో తేడాలుంటే ప్రధానోపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుంది.ఆహారాన్ని వేడిగా వడ్డించడంతో పాటు శుద్ధజలాలు సరఫరాల చేయాలి.

ఎక్కడపడితే అక్కడ భోజనం చేయకుండా ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి. చేతులు కడుక్కునేందుకు సబ్బులు అందుబాటులో ఉంచాలి. భోజనం తయారీలో నాణ్యత పాటించేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలి.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి పోషకాలున్న కూరగాయలు అందించాలి.

నిర్వాహకులకు ఊరటఅప్పులు తెచ్చి ఉద్దెర సరకులతో బడి పిల్లలకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న వంట కార్మికుల కష్టాలకు తెరపడనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో బిల్లులు సరిగా రాక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. విద్యార్థుల పెంపుతో పాటు విద్యార్థులు చదువులకు దూరం కావొద్దనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం బాగానే ఉన్నా.. నిర్వాహకులకు చెల్లించే బిల్లుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నెలల తరబడి జాప్యం లేకుండా ఇకపై సకాలంలో గౌరవ వేతనాలు, వంట ఖర్చులు అందనున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే సింగిల్ నోడల్ ఏజెన్సీ అకౌంట్ విధానంతో ట్రెజరీ కార్యాలయానికి సంబంధం లేకుండా నేరుగా ఏజెన్సీ ఖాతాలో బిల్లులు జమ చేయనున్నారు. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు నిర్వాహకుల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. ఈ విధానంతో నిధుల విడుదల ప్రక్రియ ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందనే వివరాలను పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో ఇక బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే తిప్పలు తొలగిపోయాయి.

తనిఖీలు నిర్వహిస్తాం..వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశిలిచ్చాం. తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

# తేనె పట్టు.. ఆదాయానికి మెట్టు




తాంసి :మహిళలు ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాలు ఏర్పడి బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి పొందుతూ వస్తున్నారు. గ్రామీణ పాంతాల మహిళలు స్వయం ఉపాధి పొందే అవకాశాలు తక్కువగా ఉండటంతో తీసుకున్న రుణాలను వ్యవసాయానికి పెట్టుబడిగా వాడుకుంటున్నారు. దీంతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు అక్కడ లభించే వనరులతో స్వయం ఉపాధి పొందేలా అవకాశాలు కల్పించేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), సెర్ఫ్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రత్యేక దృష్టిసారించింది. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో తేనెటీగల పెంపకం చేపట్టి స్వయం సహాయక సంఘాలను భాగస్వాముల్ని చేసి ఆర్థికాభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది.

మొదటి విడతగా అయిదు మండలాల్లో

తేనెటీగల పెంపకం, ఉత్పత్తి చేపట్టేందుకు మొదటి విడతగా వాంకిడి, తిర్యాణి, సిర్పూర్(టి), ఆసిఫాబాద్, జైనూర్ మండలాల్లోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో గత మే, జూన్‌లో మండల సమాఖ్యాల ఆధ్వర్యంలో సభ్యులకు తేనెటీగల పెంపకంపై శిక్షణనిచ్చారు. శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగలను పెంచడం, తేనెను సేకరించే విధానాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శిక్షణ నిచ్చారు. త్వరలో శిక్షణ పొందిన సభ్యులకు తేనెటీగల పెంపకం కోసం పెట్టెలను సరఫరా చేయనున్నారు.

# నిఘా కొరవడి.. కోతలకు ఎగబడి



ఆదిలాబాద్ : శస్త్ర చికిత్స కాన్పుల వల్ల ఎన్నో దుష్పరిణామాలను మహిళలు ఎదుర్కోవాలి వస్తోందని భావించిన ప్రభుత్వం సాధారణ కాన్పులకే ప్రాధాన్యమివ్వాలని, సహజ ప్రసవాల సంఖ్య పెంచాలని సూచిస్తోంది. ఈ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా పాలనాధికారులు, డీఎంహెచ్‌ఓలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని సూచిస్తున్నారు. ప్రతి వారం ఈ విషయమై హైదరాబాద్ స్థాయి నుంచి సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈ సూచనలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే అమలవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు మాత్రం పట్టించుకోవటం లేదు. 2021–22లో జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.10 శాతం సాధారణ ప్రసవాలు చేయగా ప్రైవేటులో 14.87 శాతం మాత్రమే చేశారు. 2022–23లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72.73 శాతం సహజ కాన్పులు కాగా ప్రైవేటులో 14.58 శాతం మాత్రమే చేశారు.

మూలన పడ్డ ఈ–బర్త్ విధానం

ప్రభుత్వం రెండేళ్ల కిందట 'ఈ–బర్త్' విధానం రూపొందించింది. ప్రతి ఆసుపత్రికి ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. ఈ విధానంలో ప్రభుత్వ/ప్రైవేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు చేసే స్కానింగ్ పరీక్షల వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉండేది. ఈ నివేదికల ఆధారంగా సదరు గర్భిణికి సాధారణ ప్రసవం చేయవచ్చా? శస్త్ర చికిత్స కాన్పు చేయాల్సి వస్తుందా? అనేది నిర్ధారణ చేసే వారు. కొన్ని సందర్భాల్లో అబార్షన్ చేయాల్సిన పరిస్థితి తలెత్తితే ఈ విధానం ద్వారా వివరాలు తెలిసేవి. ఈ ప్రక్రియను హైదరాబాద్ స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేవారు. కేవలం కొన్నాళ్లు మాత్రమే సాగిన ఈ విధానం ఆ తరువాత కుంటుపడింది. ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పూర్తిగా కొరవడింది. జిల్లా స్థాయి వైద్యాధికారులు దీనిపై పర్యవేక్షణను విస్మరించారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా కోతల ప్రసవాలు కానిస్తున్నారు. అత్యవసరమైతేనే శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నామని వాదించే ప్రైవేటు వైద్యులు సమస్యాత్మక కాన్పులను ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేసిన కేసులు సైతం అక్కడ సాధారణ ప్రసవాలవుతున్నాయి. మరి ప్రైవేటులో ఎందుకు సాధారణ కాన్పులు కావటం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు యాజమాన్యాలు శస్త్ర చికిత్స కాన్పులు చేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి.

తనిఖీలు చేస్తేనే అక్రమాలు వెలుగుచూస్తాయి

ఇటీవల కరీంనగర్ జిల్లాలో ఒక ప్రైవేటు ఆసుపత్రి వారు గర్భిణికి శస్త్రచికిత్స కాన్పు చేసి సాధారణ ప్రసవం అయినట్లు నివేదికల్లో పొందుపరిచారు. వైద్యాధికారులు సదరు బాలింతకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటే ఆమెకు శస్త్ర చికిత్స కాన్పు చేసినట్లు బహిర్గతమైంది. ఈ విధానం జిల్లాలోనూ అమలు చేస్తూ, తరచూ ప్రైవేటు నర్సింగ్‌హోంలను తనిఖీ చేస్తే ఆ ఆసుపత్రుల్లో జరిగే అవకతవకలు వెలుగు చూసే అవకాశాలుంటాయి. కానీ అధికారులు ఈ దిశలో ప్రయత్నం చేయటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

ప్రైవేటులో 85 శాతానికి పైగా కోతలే..

రెండేళ్ల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10,952 ప్రసవాలు జరగగా వీటిలో 3,042(27.77శాతం) మాత్రమే శస్త్ర చికిత్స కాన్పులు జరిగాయి. ప్రైవేటులో 5,287 కాన్పులు కాగా 4,403(85.17శాతం) కోతకాన్పులు చేశారు. సంవత్సరాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

# కంప్యూటర్ కోర్సులకే అగ్రాసనం


ఖమ్మం : మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా యంత్ర విద్యలో గుణాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పటి సాంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ బ్రాంచిలన్నీ కంప్యూటర్ సైన్స్‌తో అనుసంధానం చేయాల్సిన అవసరం ఏర్పడటంతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కొత్త కోర్సుల అవసరం కూడా అనివార్యమవుతోంది. దీంతో ఇప్పుడు యంత్ర విద్యలో కంప్యూటర్ సైన్స్ ఆధారిత కోర్సులను ప్రవేశపెడుతున్నారు.

శాఖోపశాఖలుగా విస్తరణ

పెరుగుతున్న అవసరాల దృష్ట్యా ప్రగతిలో వేగంగా దూసుకుపోతున్న కంప్యూటర్ సైన్స్ శాఖోపశాఖలుగా విస్తరించి సమస్త రంగాలను తన గుప్పిట్లోకి తీసుకుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగావకాశాలు ఉండటం కూడా ఈ కోర్సులకు తీవ్రమైన డిమాండ్ ఏర్పడటానికి ప్రధాన కారణం.

పలు రకాల కొత్త కోర్సులు: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(ఏఐఅండ్ఎంఎల్), ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్(ఏఐఅండ్‌డీఎస్), కంప్యూటర్ హ్యూమన్ ఇంటర్‌ఫేస్(సీహెచ్ఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), గేమ్ డిజైనింగ్, నెట్ వర్కింగ్స్, కంప్యూటర్ గ్రాఫిక్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్.

సీఎస్ఈ, ఈసీఈలపై మక్కువ



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 12 యంత్ర విద్య కళాశాలలున్నాయి. 14 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. కొత్తగూడెంలోని మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాల మాత్రమే కేయూ పరిధిలో ఉండగా.. మిగతావన్నీ జేఎన్‌టీయూ పరిధిలో నడుస్తున్నాయి. గత ఏడాది ప్రవేశాలను పరిశీలిస్తే అత్యధిక శాతం విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ వైపే మొగ్గుచూపారు. తర్వాత ఈసీఈ శాఖను ఎక్కువ మంది ఎంపిక చేసుకున్నారు. మిగతా వాటికి ప్రాధాన్యం అంతంత మాత్రంగా ఉంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సాంప్రదాయ కోర్సులపై పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ఇప్పుడు వాటితోపాటు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సులను కూడా అనుసంధానం చేస్తున్నారు. గతేడాది రెండు జిల్లాల్లో అన్ని కోర్సుల్లో 64% సీట్లు నిండగా సీఎస్‌సీలో 94%, ఈసీసీలో 70% ప్రవేశాలు పొందడం విశేషం.

ఆ కోర్సులకు అదనం 'బీటెక్ మైనర్స్'

సాంప్రదాయ కోర్సులకు తగ్గుతున్న ఆదరణ దృష్ట్యా బీటెక్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా నూతన టెక్నాలజీని నేర్చుకునే విధంగా 'బీటెక్ మైనర్స్' పేరుతో జేఎన్‌టీయూ కొత్త డిగ్రీలను ప్రవేశపెట్టింది. ఈ డిగ్రీతో సాంప్రదాయ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సబ్జెక్టులకు అదనంగా ఏఐఅండ్ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఐవోటీ రంగాల్లో మైనర్స్ పట్టా పొందవచ్చు బీటెక్ డిగ్రీకి అవసరమైన 160 క్రెడిట్స్‌కి అదనంగా 18 క్రెడిట్స్‌ని ఏఐఅండ్ఎంఎల్, డైటా సైన్స్, ఐవోటీ తదితర రంగాల్లో ఎంపిక చేసుకుని వాటికి సంబంధించిన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

సాఫ్ట్‌వేర్ అవకాశాలకు దోహదకారి

ఈ మైనర్స్ ప్రోగ్రాం సబ్జెక్టును మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ నుంచి ప్రారంభించి నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లోగా చదవాల్సి ఉంటుంది. ఈ కోర్సులను కళాశాలల నుంచి లేదా ప్లాట్‌ఫారం ఎంవోవోసీఎస్ ద్వారా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. ఈ మైనర్స్ పట్టా ద్వారా బీటెక్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సాంప్రదాయ ఉద్యోగ రంగంలోని కొలువులను పొందటమే కాకుండా సాఫ్ట్‌వేర్‌లోని అవకాశాలను పొందేందుకు దోహదపడుతుంది. కొత్త సాంకేతికతను తమ సాంప్రదాయ రంగంలోని వైజ్ఞానికతకు జత పరిచేందుకు, ఇంటర్ డిసిప్లేనరి రంగాల్లో నూతన ఆవిష్కరణలకు కూడా చేయూతనిస్తుంది.ఖమ్మం జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు: స్వర్ణభారతి, ప్రియదర్శిని మహిళా, కిట్స్, బొమ్మ, విజయ, డేర్, సాయిస్ఫూర్తి, మదర్ థెరిసా.

భద్రాద్రి: అనుబోస్, అబ్దుల్ కలాం, కేఎల్ఆర్, కేయూ మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలలు.

# నిలిచిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఖమ్మం : జిల్లా ప్రధానాసుపత్రిలోని టీహబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు తాత్కాలిక బ్రేక్ పడింది. మొత్తం 57 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేసేందుకు ప్రభుత్వం దీనిని నెలకొల్పింది. కొంత కాలంగా పరీక్షల నిర్వహణ విధిగా కొనసాగకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెద్దాసుపత్రితో పాటు పీహెచ్‌సీలకు అనుసంధానం చేసి రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను ఇక్కడ పరీక్షిస్తారు. తరచు సాంకేతిక సమస్యలు, రసాయనాలు, కిట్ల కొరత తలెత్తడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిలిచిపోతున్నాయి. గత నెలలో రసాయనాల కొరత కారణంగా కొంత కాలం ఇలాగే సేవలను నిలిపివేశారు. ఈ క్రమంలో నిరుపేద వర్గాలకు ఆర్థిక భారం తప్పలేదు. తాజాగా డిస్టిల్ వాటర్ సరఫరా ప్రధాన ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా చిన్న ప్లాంట్‌ను వినియోగిస్తూ పరీక్షల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రధాన ప్లాంట్ క్యాండిల్స్‌ను మార్చేందుకు సాంకేతిక నిపుణులకు సమాచారం అందించారు. ముంబాయి నుంచి దానికి సంబంధించిన పరికరాలు రావాల్సి ఉంది. తాత్కాలిక ఏర్పాట్లు చేసినా పరీక్షల నిర్వహణ, నివేదికల జారీలో జాప్యం ఏర్పడుతోంది. దీంతో రెండు రోజులకు ఒకసారి నమూనాలు సేకరిస్తూ పరీక్షలను పూర్తి చేస్తున్నార్లు. ఈ విషయమై టీహబ్ మేనేజర్ బింధును వివరణ కోరగా త్వరలోనే ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేయించి పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు.



# పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ

గాంధీనగర్: 'మోదీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. తనకు విధించిన రెండేళ్ల శిక్షను నిలిపివేయాలంటూ వేసిన స్టే పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు కొట్టేసింది. ఈ కేసులో సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. 'రాహుల్ ఇప్పటికే దేశవ్యాప్తంగా 10 కేసులను ఎదుర్కొంటున్నారు. ఇక ఈ కేసులో ఆయనకు కిందికోర్టు శిక్ష విధించడం సరైనదే, న్యాయపరమైనదే. ఈ శిక్షను నిలిపివేసేందుకు ఎలాంటి కారణాలు కన్పించట్లేదు. అందుకే పిటిషనర్ అభ్యర్థనను కొట్టివేస్తున్నాం" అని జస్టిస్ హేమంత్ ప్రచక్ తీర్పు వెలువరించారు. జైలు శిక్షపై స్టే ఇవ్వకపోవడంతో రాహుల్‌పై అనర్హత వేటు కొనసాగుతుంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుజరాత్ హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బే. అయితే, ఈ కేసులో రాహుల్ ఇప్పుడే జైలుకు వెళ్లే అవకాశం లేనట్లు తెలుస్తోంది. శిక్ష అమలును హోల్డ్ చేస్తూ గతంలో న్యాయస్థానం ఆయనకు కాస్త ఊరటనిచ్చింది. కాగా.. గుజరాత్ హైకోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దొంగలందరికీ మోదీ అనే ఇంటిపేరే ఎందుకు ఉంటుందో?' అంటూ 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలకు గానూ గుజరాత్ భాజపా ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ న్యాయస్థానంలో పరువునష్టం దావా వేశారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఈ ఏడాది మార్చిలో తీర్పు వెలువరించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం, పార్లమెంటు సభ్యులు ఏదైనా కేసులో దోషిగా తేలి.. కనీసం రెండేళ్ల శిక్ష పడితే అనర్హత వేటు పడుతుంది. దీంతో ట్రయల్ కోర్టు తీర్పు వెలువర్చిన 24 గంటల్లోనే రాహుల్‌పై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. కాగా.. ట్రయల్ కోర్టు తీర్పుపై రాహుల్ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేయాలని.. అలాగే తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలంటూ రెండు పిటిషన్లు దాఖలు చేశారు.

వీటిపై ఏప్రిల్‌లో విచారణ జరిపిన సెషన్స్ కోర్టు.. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, జైలు శిక్షపై స్టే ఇచ్చేందుకు మాత్రం నిరాకరించింది. దీంతో ఆయన గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా రాహుల్‌కు నిరాశే ఎదురైంది.

# నేటి నుంచి సీఎం వైఎస్ జగన్ జిల్లా పర్యటన



కడప : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు అధికారికంగా సమాచారం అందింది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం గండికోట, పులివెందులలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. సోమవారం కడప నగరంతోపాటు కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.

**8వ తేదీ పర్యటన ఇలా..** మధ్యాహ్నం 1.30 గంటలకు కల్యాణదుర్గంలో బయలుదేరి 1.55 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 2.05 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్దకు వెళతారు. 2.25 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తారు. 2.25 గంటలకు ఘాట్ నుంచి బయలుదేరి ప్రేయర్ హాలుకు 2.30 గంటలకు చేరుకుంటారు. 5.30 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. 5.35కు హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

**9వ తేదీ..** ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్సి నుంచి బయలుదేరి 8.55 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు. 9.20 గంటలకు గండికోట హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 9.30 గంటలకు ఒబెరాయ్ హెూటల్ శంకుస్థాపనలో పాల్గొంటారు. 10.15 గంటలకు గండికోట వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు. 10.25 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు గండికోట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.50 గంటలకు పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.05 గంటలకు పులివెందుల కొత్త మున్సిపల్ కార్యాలయ భవనం వద్దకు చేరుకుంటారు. 11.40 గంటల వరకు మున్సిపల్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం, పులివెందుల కౌన్సిలర్లతో సమావేశమవుతారు. 11.45 గంటలకు రాణితోపు చేరుకుంటారు. 12.10 గంటల వరకు పులివెందుల సిటీ ఫారెస్టు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 12.15 గంటలకు గరండాల రివర్ ఫ్రంట్‌కు చేరుకుని గరండాల కెనాల్ డెవలప్‌మెంట్ మొదటి దశ పనులను ప్రారంభిస్తారు. 12.50 నుంచి 1.15 గంటల వరకు వైఎస్సార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 1.25 గంటలకు న్యూటెక్ బయోసైన్స్, ఏపీ కార్ల్‌లో ప్రారంభోత్సవాల్లో గడుపుతారు. 1.50 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 2.20 గంటల వరకు రిజర్వు. 2.30 గంటలకు వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.10 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 3.15 గంటలకు బయలుదేరి 3.35 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 3.35 నుంచి 4.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. 4.10కి హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

**10వ తేదీ..** ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్స్ నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 9.20 గంటలకు కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 9.25 నుంచి 10.00 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. 10.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు రాజీవ్ మార్గ్ చేరుకుంటారు. 10.20 గంటల వరకు రాజీవ్ మార్గ్ రోడ్డు ప్రారంభోత్సవంలో గడుపుతారు. 10.25కు రాజీవ్ పార్కు చేరుకుంటారు. 10.35 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారు. 10.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 11.00 గంటలకు కొప్పర్తి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.10 గంటలకు అల్ డిక్సన్ యూనిట్‌కు చేరుకుని ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 11.35 నుంచి 11.45 గంటల వరకు పారిశ్రామిక యూనిట్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో గడుపుతారు. 11.55 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 12.10 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. 12.15 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటకు గన్నవరం విమానాశ్రయానికి వెళతారు. 1.30 గంటలకు సీఎం నివాసానికి వెళతారు.




## మన గుర్తేంటి?.. 'సైకిల్'.. మహిళ సమాధానం విని అవాక్కయిన మంత్రి

మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సిక్కోలు మహిళ ఝలక్ ఇచ్చింది. మన గుర్తు ఏంటని మంత్రి ప్రశ్నించగా.. 'సైకిల్' అని మహిళ చెప్పింది. ఈ మాటతో ఆయన అవాక్కయ్యారు. ఆ తర్వాత ఆమె సర్దుకుని ఫ్యాన్ అని చెప్పడంతో బుర్రలోకి ఎక్కించుకోవాలని సూచించారు. శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఈ సంఘటన జరిగింది.

## లోకేష్ ఆరోపణలు.. వేంకటేశ్వరుని సన్నిధిలో మాజీ మంత్రి అనిల్ ప్రమాణం

నెల్లూరు జిల్లా: వెంకటేశ్వరపురం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ శుక్రవారం పూజలు నిర్వహించారు. తనకు ఎలాంటి అక్రమాస్తులు లేవని ఆలయంలో అనిల్ ప్రమాణం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోకేష్ తనపై చేసిన ఆస్తుల ఆరోపణలపై దేవుడి ఎదుట ప్రమాణం చేశానని తెలిపారు. "నేను చేసినంత ధైర్యంగా లోకేష్ దేవుడి ఎదుట ప్రమాణం చేయగలరా?. లోకేష్ చెప్పిన ఆస్తులు నావే అని సోమిరెడ్డి చేస్తారా?. నేను ఎదుటి వారికి సహాయం చేశాను కానీ, అక్రమాస్తులు కూడబెట్టలేదు. అప్పు చేసి వ్యాపారం చేయడం తప్పు ఎందుకు అవుతుంది?. నేను తప్పు చేసి ఉంటే దేవుడే చూసుకుంటాడు. ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి పై లోకేష్ చేసిన వ్యాఖ్యలు సరికాదు" అని అనిల్ పేర్కొన్నారు.

# వాహనాల త్రైమాసిక పన్ను పెంపుపై తులసి రెడ్డి ఫైర్..



అమరావతి: వాహనాల త్రైమాసిక పన్ను పెంపుపై కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రవాణా రంగం కుదేలైందని విమర్శించారు. వాహనాల త్రైమాసిక పన్ను పొరుగు రాష్ట్రాల కంటే ఏపీలో ఇప్పటికే 30 శాతం ఎక్కువగా ఉందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పొరుగు రాష్ట్రాల కంటే లీటర్‌కు రూ. 5 – 12 ఎక్కువని తెలిపారు. గ్రీన్ టాక్స్‌ను రూ.200 నుంచి రూ.20 వేల వరకు పెంచడం జరిగిందన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. టైర్లు, స్పేర్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం పెరిగిందని తెలిపారు. గోరు చుట్టుపై రోకటి పోటులా త్రైమాసిక పన్నును మళ్లీ 25 శాతం పెంచుతూ.. మే 12న జీఓ 31 జారీ చేయడం శోచనీయమన్నారు. దీని వలన 10 టైర్ల లారీ త్రైమాసిక పన్ను గతంలో రూ.6600 ఉండగా, ప్రస్తుతం రూ.8410 అవుతుందన్నారు... దీని వలన ఏటా రూ.250 కోట్లు అదనపు భారం పడుతోందన్నారు. జీఓ 31 నీ వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని తులసిరెడ్డి అన్నారు.

# ముందస్తు మీద నీళ్ళు చల్లేసిన సజ్జల



అమరావతి : ఏపీ లో ఎపుడు ఎన్నికలు వస్తాయా అన్నది విపక్షం ఆశ. దాని కోసం వారు ఎదురు చూస్తుంటారు కూడా. ఎందుకంటే విపక్షం లో ఉండడం అంటే విరహంతో సతమతం అవడమే. అధికారానికి దూరం అయితే మిగిలేది విరహమే. అధికారం లోకి రావాలన్నది ప్రతిపక్షాల ఆశ లక్ష్యం కూడా. వారికి అధికారం లో ఉన్నపుడు అయిదేళ్ళు చాలవు అనిపిస్తుంది. వారే విపక్షం లోకి వస్తే మాత్రం ఇంతకాలమా ఎన్నికలు అని భారంగా నిట్టూరుస్తారు. ఇపుడు ఏపీ లో అదే జరుగుతోందా అంటే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డి చెప్పిన దాన్ని బట్టి చూస్తే ఏపీ లో ముందస్తు లేదు ఏమీ లేదు అని అంటున్నారు. అంటే ఆయన విపక్షాల ఆశల మీద నీళ్లు చల్లేశారు అనుకోవాలి. ఏపీ లో ముందస్తు అంటే మరో నాలుగైదు నెలల పాటు బండి ని నడిపిస్తే సరిపోతుంది. అదే మే లో ఎన్నికలు అంటే మాత్రం ఇప్పటికి బిగిసి తొమ్మిది నెలలు ఉంది. దాంతో విపక్షం మాత్రం తొందరపడుతోంది. ఇదిలా ఉంటే జగన్ ఢిల్లీ టూర్ సందర్భంగా ముందస్తు ఎన్నికలు అంటూ ఈ మధ్య ప్రచారం సాగడం జరుగుతూ వస్తోంది. గత నెల లో అలాగే ప్రచారం జరిగింది. ఈసారి కూడా అదే తీరుగా ఉంది. ప్రధాని మోడీ కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో జగన్ వరస గా గంట తేడాలో భేటీ కావడంతో పాటు సుదీర్ఘంగా చర్చించడంతో ఇక ముందస్తు తథ్యమని అంతా అనుకున్నారు. దానికి తోడు కేంద్రంలో ని బీజేపీ కూడా ముందస్తుకు సుముఖంగా ఉందని లోక్ సభను రద్దు చేస్తారు అని కూడా ప్రచారం సాగడంతో ముందస్తు తప్పదని అనుకున్నారు. అయితే దాన్ని సజ్జల రామక్రిష్ణారెడ్డి తెగేసి మరీ కొట్టేశారు ముందస్తు మాకు అవసరం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. ప్రజలు మాకు అయిదేళ్ళకు సరిపడా అధికారాన్ని ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు అని స్పష్టం చేసారు. తెలుగుదేశం పార్టీయే ముందస్తు అని గేమ్ స్టార్ట్ చేసింది అని ఆయన అంటున్నారు దానికి కారణం కూడా చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో సీట్ల బేరాన్ని ఖరారు చేసుకోవడానికే ముందస్తు అని అంటోందని ఆయన చెప్పడం విశేషం. తమ పార్టీ పూర్తిగా పాజిటివ్ ఓట్ల మీదనే ఆధారపడి ముందుకు సాగుతోంద ని ఆయన వెల్లడించారు. తాము ప్రజల కు చేసిన మంచి ని నమ్ముకున్నామని అన్నారు. విపక్షాలు ఒక వ్యూహం ప్రకారం ముందస్తు అని ప్రచారం చేస్తున్నాయని దాన్ని అసలు నమ్మవద్దని ఆయన అంటున్నారు ఇదిలా ఉంటే ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు అయితే ముందస్తు ఎన్నికల కోసమే వైసీపీ కేంద్ర పెద్దల తో చర్చిస్తోంది అని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ లో ముందస్తు విషయంలో ప్రచారం అలాగే సాగుతోంది. ఇప్పటికే సీఎం జగన్ నుంచి క్లారిటీ వచ్చింది. సజ్జల పదే పదే చెబుతున్నారు. అయినా ముందస్తు తప్పదని ప్రతిపక్షం అంటోంది. మరి ఇందు లో ఎవరిది గేం ప్లాన్ ఎవరిది వ్యూహం అన్నది తెలియాలంటే మరి కొద్ది నెలల కాలం ముందుకు జరగాల్సిందే అంటున్నారు.

# విశాఖ ఎంపీ సీటు : పురంధేశ్వరి జీవీఎల్ ల మధ్య పోటా పోటీ






విశాఖపట్నం : రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విశాఖ లోక్ సభ సీటు ని ఆశిస్తున్నారు. బీజేపీ తరఫున పోటీ చేయడానికి ఆయన రెండేళ్ళ ముందు నుంచే రంగం సిద్ధం చేసుకుంటూ వస్తున్నారు. ఇదే సీటు కోసం కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి కూడా పోటీ పడుతున్నారు. ఆమె రెండు సార్లు విశాఖ నుంచి పోటీ చేశారు. 2009లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తే ఘన విజయం సాధించడమే కాదు కేంద్రం లో మంత్రి కూడా అయ్యారు. ఇక 2019లో ఆమె బీజేపీ తరఫున పోటీ చేశారు కానీ డిపాజిట్లు దక్కలేదు. పొత్తులు లేకపోవడం వల్ల బీజేపీ ఓడిపోయింది. ఇదిలా ఉంటే 2024లో కూడా విశాఖ నుంచే పోటీ చేయాల ని పురంధేశ్వరి డిసైడ్ అయినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఆమె అత్తింటి వారిది ప్రకాశం జిల్లా. అయితే ఆమె 2004లో తొలిసారి బాపట్ల నుంచి ఎంపీ గా కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. 2009 నాటికి ఆ సీటు ఎస్సీకి రిజర్వ్ కావడంతో ఆమె విశాఖ కు షిఫ్ట్ కావాల్సి వచ్చింది. ఇక 2014లో బీజేపీ లో చేరాక ఆమె రాజంపేట నుంచి కూడా పోటీ చేసి టీడీపీ తో పొత్తు ఉన్నా ఓటమి పాలు అయ్యారు. గట్టిగా చెప్పాలీ అంటే పురంధేశ్వరి కి పోటీ చేసేందుకు సొంత సీటు లేదు. ఆమె విశాఖనే నమ్ముకున్నారని అంటారు. వలస పక్షుల కు అడ్డా అయిన విశాఖ ఎంపీ సీట్లో ఈసారి పోటీ చేస్తే బీజేపీ కి కొంత పట్టు ఉంది పొత్తులు ఉంటే ఈజీ గా గెలవవచ్చు అన్నది ఆమె ఆలోచన అంటున్నారు. ఇక జీవీఎల్ ని తీసుకుంటే ఆయన కూడా ప్రకాశం జిల్లాకు చెందిన వారే. ఆయన గతం లో నరసారావు పేట నుంచి పోటీకి ప్రయత్నించారని వార్తలు వచ్చాయి. ఆయన పుట్టిన ప్రాంతం అక్కడే ఉంది అని అంటారు. అయితే సామాజిక సమీకరణ రిత్యా అక్కడ గెలుపు కష్టం అని భావించిన మీదటనే ఆయన విశాఖ వైపు చూపు మరల్చారని అంటున్నారు. ఆయన సామాజిక వర్గం అయిన బ్రాహ్మణులు విశాఖ లో రెండు లక్షల మంది ఉన్నారు. దాంతో తాను విశాఖ బరి లో ఉంటాను అని కేంద్ర పెద్దల కు చెప్పిన మీదటనే జీవీఎల్ విశాఖ కు షిఫ్ట్ కావడం సొంత ఇల్లు కూడా కొనుగోలు చేసి రెండేళ్ల నుంచి విశాఖ కార్యక్షేత్రంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అని అంటున్నారు. ఇదిలా ఉంటే జీవీఎల్ కి జాతీయ స్థాయిలో మూల విరాట్టుల తోనే సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అంటున్నారు. ఆయన నెట్ వర్క్ కూడా గట్టిది అని అంటున్నారు. కేంద్ర పెద్దల సూచనల తోనే జీవీఎల్ విశాఖ బరి లో నిలబడబోతున్నారు అని అంటున్నారు. ఆరెస్సెస్ ఏబీవీపీ బీజేపీల లో దశాబ్దాలుగా పనిచేసిన జీవీఎల్ కి పెద్దల దన్ను ఉందని అంటున్నారు. దాంతో ఆయన విశాఖ సీటు తనదే అన్న ధీమాతో ఉన్నారని అంటున్నారు. ఇదిలా ఉండగా అనూహ్యంగా దగ్గుబాటి పురంధేశ్వరి ఇపుడు రేసు లోకి వచ్చారని అంటున్నారు. ఆమెను కేంద్ర పెద్దలు ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా చేశారు. దాంతో ఆమె కోరుకున్న సీటు లో పోటీ చేసేందుకు వీలు కుదిరింది అని అంటున్నారు. ఈ నేపథ్యం లో జీవీఎల్ కూడా దూకుడు పెంచేశారు. ఆయన తన పుట్టిన రోజు ను మొదటిసారి విశాఖ వేదికగా చేసుకున్నారు. విశాఖ నిండా ఆయన హెూర్డింగులు కటౌట్లు పెట్టేశారు నిరంతర శ్రమ జీవి గా కూడా ఆయన అభిమానులు పేర్కొంటున్నారు. విశాఖ నుంచి పోటీ చేసేందుకే జీవీఎల్ తన పుట్టిన రోజు వేడుకల ను ఈసారి అట్టహాసంగా చేసుకున్నారని అంటున్నారు. దీనిని బట్టి చూస్తే జీవీఎల్ వర్సెస్ పురంధేశ్వరిగా విశాఖ లో సీటు వార్ సాగుతోంది అంటున్నారు ఎవరికి ఈ ఇద్దరి లో విశాఖ సీటు దొరుకుతుంది అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు. కేంద్ర పెద్దల కు ఇపుడు ఇద్దరూ సన్నిహితులైన వారే కావడం తో ఎవరికి విశాఖ ఎంపీ టికెట్ ఇస్తారు అన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా ఉంది. ఏది ఏమైనా తగ్గేదే అన్నట్లుగా జీవీఎల్ వర్సెస్ పురంధేశ్వరిల మధ్య సీటు వార్ సాగుతోంది అంటున్నారు.

# ఇదేం పని పెద్దారెడ్డి..: జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రైతులకు రావాల్సిన పరిహారాన్ని స్వాహా చేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. బత్తాయి మొక్కలు నాటిన ఏడాదికే పంట నష్టం పరిహారం కింద ?13.89లక్షలు పెద్దారెడ్డి రాయించుకున్నారని చెప్పారు.

ఈ మేరకు ఆయన విడుదల చేసిన జాబితాలో కేతిరెడ్డి పేరుందంటూ ఆధారాలు మీడియాకు చూపించారు. ఎమ్మెల్యేకు భయపడి అధికారులు పరిహారం ఇస్తున్నారన్నారు. పరిహారం నిధులను ఖాతాలో జమ చేసే లోగా ఈ అవినీతిని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం'తో దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. తిండి నుంచి దుస్తుల వరకు అన్నీ నేతన్నల నుంచి దోపిడీ చేసినవేనని మండిపడ్డారు. ధర్మవరంలో నేసేవాళ్లు ఎంత బాధపడుతున్నారో ఎవర్ని అడిగినా తెలుస్తుందని జేసీ ఆరోపించారు.



## ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి రెండోరోజూ నిరసనలే

గుమ్మలక్ష్మీపురం : 'గడప గడపకు' కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి నిరసన సెగ తగిలింది. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం చింతలపాడులో ఎమ్మెల్యే తమ గ్రామానికి రావద్దంటూ గిరిజనులు నిరసన తెలిపారు. బుధవారం దుడ్డుకల్లులో ఎమ్మెల్యేను అడ్డుకోవడంతో..గురువారం పోలీసు రక్షణలో పుష్పశ్రీవాణి చింతలపాడు వెళ్లారు. ఎమ్మెల్యే పర్యటనపై గ్రామస్థులు నిరసన తెలుపుతూ.. వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఆహ్వాన ఫ్లెక్సీలపై పేడ పూశారు.

# షర్మిల రాకతో షెడ్యూల్ మార్చుకున్న జగన్..!

అమరావతి: వైఎస్సార్ కుటుంబంలో విబేధాలు మరోసారి బయటపడ్డాయి. శనివారం (8వ తేదీ) ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించే కార్యక్రమంలో అన్న సీఎం జగన్, సోదరి షర్మిల విడి విడిగా కార్యక్రమంలో పాల్గొననున్నారు. గతంలో ఇద్దరూ కలిసి నివాళులర్పించినా ముభావంగా కనిపించేవారు. అయితే ఈసారి మాత్రం వేర్వేరు సమయాల్లో తండ్రి సమాధి దగ్గరకు వెళుతున్నారు. శుక్రవారం రాత్రి షర్మిల తన తల్లి విజయలక్ష్మితో కలిసి ఇడుపులపాయ చేరుకోనున్నారు. శనివారం ఉదయం వైఎస్‌కు నివాళులర్పించి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరనున్నారు. కాగా షర్మిల రాకతో జగన్ తన షెడ్యూల్ మార్చుకున్నట్లు సమాచారం. ప్రతి ఏడాది ముందుగానే వైఎస్ ఘాట్‌కు చేరుకునే జగన్.. ఈసారి మాత్రం శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఇడుపులపాయకు రానున్నారు. అనంతపురం జిల్లా, కల్యాణదుర్గం పర్యటన ముగించుకుని ఇడుపులపాయ వెళ్లి వైఎస్‌కు నివాళులర్పించనున్నారు. మరోవైపు వైఎస్ జయంతి సందర్భంగా కుటుంబసభ్యులంతా కలిసి ఇడుపులపాయలో నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది. జగన్, షర్మిల మధ్య గత విబేధాలు ఉన్నప్పటికీ గతేడాది నుంచి ఇద్దరూ తన తల్లితో కలిసి ఘాట్ వద్ద నివాళులర్పించారు.

ఎన్ని కార్యక్రమాలు ఉన్నా జగన్ ఉదయాన్నే వైఎస్ ఘాట్‌కు వచ్చేవారు. అయితే ఈసారి షర్మిలతో విబేధాల కారణంగా ఆనవాయితీకి జగన్ ఫుల్‌స్టాప్ పెట్టినట్లు కనిపిస్తోంది. రాజకీయంగా ఇద్దరి దారులు వేరైనందువల్లే జగన్ ఈసారి షర్మిల వెళ్లిపోయిన తర్వాతే ఇడుపులపాయ వస్తున్నారు. జగన్ మేనమామ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. మొత్తంగా ఈ వ్యవహారంతో జగన్, షర్మిల మధ్య విబేధాలు మరోసారి రచ్చ కెక్కాయి. తండ్రి జయంతి రోజున కూడా ఇద్దరూ కలవలేనంత గొడవలు వైఎస్ కుంటుంబంలో ఏం జరిగి ఉంటాయని అభిమానుల చర్చించుకుంటున్నారు. ఇదే అంశంపై పలువురు నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# సమంత గారు.. ఇదేమైనా బాగుందా?

ప్రస్తుతం సోషల్మీడియాలో టాలీవుడ్ నుంచి ఫుల్ ట్రెండ్ అవుతున్న విషయాల్లో సమంత సినిమాలకు బ్రేక్ మ్యాటర్ ఒకటి. 'శాకుంతలం' డిజాస్టర్ తర్వాత 'ఖుషి' ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్సిరీస్ షూటింగ్లతో బిజీగా గడుపుతన్న సామ్.. తన అభిమానులకు సినీ ప్రియులకు షాక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.ఆమె ఈ చిత్రాలు పూర్తైన తర్వాత ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ ఇవ్వనున్నట్లు ప్రస్తుతం జోరుగా ప్రచారం సాగుతోంది. పూర్తిగా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అందుకు అవసరమైన పూర్తిస్థాయి చికిత్స తీసుకోవడం కోసం.. ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతా బాగానే ఉంది కానీ..



ఇక్కడ మరో విషయం ఏంటంటే.. సమంత పూర్తి చేయబోయే సినిమాల ప్రమోషన్స్ గురించి. సాధారణంగా ప్రమోషన్స్ అంటే చిత్రబృందమంతా వరుస ఇంటర్వ్యూలు లేదా స్పెషల్ ఈవెంట్లు ప్లాన్ చేస్తూ ఖాళీ లేకుండా తిరుగుతూ ఉంటుంది. కానీ.. ఎంత మంది ప్రమోషన్స్లో పాల్గొన్నా మెయిన్ అట్రాక్షన్ మాత్రం హీరోహీరోయిన్లే. కొన్ని సందర్భాల్లో వారితో పాటు చిత్రంలో నటించే ఇతర స్టార్ యాక్టర్స్. అయితే ఇప్పుడు ఖుషిసిటాడెల్ ప్రమోషన్స్ విషయానికొస్తే.. ఖుషి సినిమా సెప్టెంబరు 1న రిలీజ్ కానుంది. అంటే ఈ చిత్రానికి కనీసం నెల రోజుల ముందు నుంచి ప్రమోషన్స్ చేయాల్సి వస్తుంది. అయితే ఈ సినిమాకు హీరో విజయ్ దేవరకొండ ఎంత స్పెషల్ అట్రాక్షనో హీరోయిన్ సమంత కూడా అంతే మెయిన్ అట్రాక్షన్. కాబట్టి ప్రమోషన్స్ తప్పనిసరిగా సమంత అందుబాటులో ఉండాల్సిందే. గతంలో శాకుంతంలో ప్రమోషన్స్లో మయోసైటిస్తో బాధపడుతున్నప్పటికీ వరుస ఇంటర్వ్యూలు ఇచ్చింది. పలు సందర్భాల్లో తన కష్టాలను చెప్పుకుని కన్నీరు కూడా పెట్టింది. కానీ చాలా మంది దాన్ని ట్రోల్ చేశారు. సానుభూతి కోసం ఇలా చేస్తుందని అన్నారు. మళ్లీ ఇప్పుడు కూడా 'ఖుషి' కోసం పాల్గొంటే ఇలానే చేసే అవకాశాలు ఉన్నాయి. ఇది అయిపోతే సిటాడెల్. ఈ సిరీస్ను అమెజాన్ ప్రైమ్.. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్యలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తోంది. దీని కోసం భారీ ఎత్తున ప్రమోషన్లు చేయాలని సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అసలే ఆ సిరీస్కు మెయిన్ అట్రాక్షన్ సమంతానే. కాబట్టి ఈ ప్రమోషన్స్లో ఆమె 'ఖుషి' కన్నా ఎక్కువగా జోరుగా పాల్గొనాల్సి ఉంటుంది. కాబట్టి ఆమెకు అస్సలు ఖాళీ ఉండదు.

అంటే మొత్తంగా చూస్తే ఆమె ఈ ఏడాది ఖాళీగా ఉండకపోవచ్చు. వచ్చే ఏడాది ఆమె బ్రేక్ తీసుకుంటుందనమాట. ఇకపోతే.. ఆ మధ్యలో పెట్టుకున్న కొత్త కమిట్ మెంట్ల కోసం తీసుకున్న అడ్వాన్సులను కూడా ఆమె తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది.

# నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే

ఇష్టం సినిమా తో హీరోయిన్ గా రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియ శరణ్ స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో పుష్కర కాలం పాటు స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన విషయం తెల్సిందే. ఇప్పుడు కూడా సినిమా ల్లో అడపాదడపా సినిమాలు చేస్తూ సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. పెళ్లి అయ్యి తల్లి గా కూడా మారిన శ్రియ అందం విషయంలో మాత్రం పదేళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. కొన్ని సార్లు ఇలాంటి హాట్ హాట్ కాస్ట్యూమ్స్ ధరించిన సమయంలో అంతకు మించి ఉ



న్నట్లు కనిపిస్తుంది. తాజాగా శ్రియ ఈ ఫొటోలు షేర్ చేసి క్లీ వేజ్ షో తో మతి పోగొడుతుంది. అందానికి వయసుతో సంబంధం ఏంటి అన్నట్టుగా ముద్దుగుమ్మ శ్రియ శరణ్ అందాల ఆరబోత చేస్తూ నాలుగు పదుల వయసులోనూ నీ యవ్వ తగ్గేదేలే అన్నట్లుగా దూసుకు పోతుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు ఈ అమ్మడి యొక్క స్కిన్ టోన్ చాలా స్పెషల్ అంటూ అభిమానులు తెగ కామెంట్స్ చేస్తూ ఈ ఫొటోలను లైక్ చేస్తున్నారు. సిల్వర్ డ్రెస్ లో నడుము నాభి అందాన్ని చూపిస్తూ... క్లీ వేజ్ షో తో జీరో సైజ్ అందాన్ని చూపిస్తూ శ్రియ శరన్ పిచెక్కిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేశారు.

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల విందు ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది.




# ఇండియన్ సినిమా పరువు తీసింది.. బాయ్ కాట్ పీసీ




సాధారణంగా ఇండియన్ ఫిల్మ్ స్టార్స్ కి హాలీవుడ్ లో ఆఫర్లు చాలా తక్కువగా వస్తూ ఉంటాయి. ఒకటి రెండు సినిమాలు లేదా సిరీస్ లు చేసినా కూడా గొప్పే. కానీ ప్రియాంక చోప్రా వరుసగా హాలీవుడ్ లో సినిమాలు సిరీస్ ల్లో నటిస్తూ గ్లోబల్ స్టార్ గా గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే. ఇటీవల ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ సిరీస్ కి మంచి స్పందన లభించింది.

ప్రపంచ వ్యాప్తంగా సిటాడెల్ సిరీస్ కి వస్తున్న ఆదరణ నేపథ్యంలో ఆమె పై మరింతగా అభిమానం చూపిస్తున్న వారు ఉన్నారు. అయితే ఇదే సమయంలో ఆమె పాత వీడియో ఒకటి వైరల్ అవ్వడంతో ఆమెను తీవ్రంగా విమర్శిస్తున్న వారు కూడా ఉన్నారు. 2016 సంవత్సరంలో జరిగిన ఎమ్మీ అవార్డ్స్ వేడుకలో ప్రియాంక చోప్రా హాజరు అయ్యింది. అంతర్జాతీయ వేదికపై ప్రతిష్టాత్మక అవార్డు వేడుకలో పాల్గొన్న ప్రియాంక చోప్రా ఇండియన్ సినిమా గురించి స్పందించాల్సిందిగా కోరిన సమయంలో... ఇండియన్ సినిమా ల్లో హిప్స్ అండ్ బి... బిస్ గురించే ఉంటుంది. హీరోయిన్స్ వాటిని చూపిస్తే చాలు అన్నట్లుగా ఒక అభిప్రాయం ఉందని సిల్లీగా డాన్స్ చేస్తూ మరీ చెత్తగా మాట్లాడింది. ఇండియన్ సినిమా పరువు తీసే విధంగా ప్రియాంక చోప్రా మాట్లాడింది అంటూ విమర్శలు గుప్పిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇండియన్ సినిమా గురించి అవమానకరంగా మాట్లాడినందుకు గాను ప్రియాంక చోప్రా ఇండియన్ సినీ ఇండస్ట్రీ నుండి బ్యాన్ చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్నారు. పాత వీడియో అయినా కూడా ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. మరి ఈ వీడియోలోని తన వ్యాఖ్యలపై ప్రియాంక చోప్రా ఎలా స్పందిస్తుంది అనేది చూడాలి.

# ఆ నలుగురు అన్నట్లు...ఇండస్ట్రీలో ఇప్పుడీ నలుగురు!



దక్షిణాది చిత్ర పరిశ్రమలో నయనతార.. త్రిష.. తమన్నా.. కాజల్ అగర్వాల్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాలగా పరిశ్రమలో కొనసాగుతున్నారు. తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు దక్కించుకుని వెలిగిపోతున్నారు. పోటీగా ఎంత మంది భామలొచ్చినా? వాళ్ల స్థానం మాత్రం చెక్కు చెదరనది. ఇంకా చెప్పాలంటే నేటి తరం నాయికలకు ఈ నలుగురు ఓ ఇనిస్పేరషన్. కొత్తగా వస్తోన్న భామలు మీకు ఏ హీరోయిన్ అంటే ఇష్టం? ఏ నటి స్ఫూర్తితో ఇక్కడి వరకూ రాగలిగారు? అంటే త్రిష..తమన్నా.. నయనతార ..కాజల్ పేర్లు చెబుతున్నారు. సాధారణంగా 40 ఏళ్లకు చేరువలో సౌత్ ఇండస్ట్రీలో రాణించడం అంత చిన్న విషయం కాదు. ఎందుకంటే ఇక్కడి పరిశ్రమలు ఎప్పటికప్పుడు కొత్త నీరు కోరుకుంటాయి. కొత్తగా ఎవరొచ్చినా స్వాగతించే అభిమానం ఇక్కడి వాళ్ల సొంతం. అయితే అలవాటైన హీరోయిన్లను అంత సులభంగా వదులుకోరు. లా కొన్ని కొలమానాలు ఆ నలుగురు భామలకి కలిసొచ్చాయి. నయనతారని బాలీవుడ్ బాద్ షా ఏరికోరి మరీ 'జవాన్' సినిమాలో తీసుకున్నాడు. ఏం బాలీవుడ్ హీరోయిన్లు లేక? నయనతారని మించిన అందగత్తెలు లేక! ఇక అందాల త్రిషకి ఇప్పటికీ తెలుగు లో అవకాశాలు క్యూలో ఉన్నాయి. ఆమె తిరస్కరించడం తప్ప! టాలీవుడ్ ఏనాడు ఆ భామని తిరస్కరించలేదు. తాజాగా మరోసారి మెగాస్టార్ చిరంజీవి తో రొమాన్స్ చేయబోతుందన్న వార్తలు హీటెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ 'పొన్నియన్ సెల్వన్' లోనూ నటించింది. ఇక చందమామ కాజల్ అగర్వాల్ ఓ బిడ్డకు తల్లైనా అదే దూకుడు చూపిస్తోంది.

'భగవంత్ కేసరి' సహా లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుం టోంది. సుదీర్ఘమైన తన కెరియర్ లో ఇప్పటికే 59 సినిమాలను పూర్తిచేసింది. 60వ సినిమాగా 'సత్యభామ' చేస్తోంది. అలాగే మిల్కీబ్యూటీ తమన్నా సైతం అదే దూకుడు ప్రదర్శిస్తోంది. సీనియర్ స్టార్స్ తో ఛాన్సులు అందుకుంటూనే వెబ్ సిరీస్ ల్లోనూ తన ట్యాలెంట్ చూపిస్తోంది.

# ఇస్మార్ట్ బ్యూటీ క్యూట్ అందాల ఆరబోత

సుధీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే సినిమా తో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ నభా నటేష్. హీరోయిన్ గా ఈ అమ్మడు మొదటి సినిమా తోనే కమర్షియల్ గా సక్సెస్ ను దక్కించుకుంది. అంతే కాకుండా ఒక మంచి హీరోయిన్ ఇండస్ట్రీకి దక్కింది అంటూ మీడియా సర్కిల్స్ మరియు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరిగేలా చేసింది. రామ్ హీరోగా పూరి దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో హీరోయిన్ గా నటించిన నభా నటేష్ ఓ భారీ కమర్షియల్ సక్సెస్ ను



దక్కించుకుంది. కానీ ఆ వెంటనే కరోనా కారణంగా ఈమె కు ఆశించిన స్థాయి లో ఆఫర్లు రాలేదు. ప్రస్తుతం ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు కొత్త సినిమాలకు కమిట్ అయిన దాఖలాలు కనిపించడం లేదు. సినిమాల్లో నటించకున్నా కూడా సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలు మరియు వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంది.

అందాల ముద్దుగుమ్మ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ మరో సారి తన క్యూట్ అందాల ప్రదర్శన చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నభా నటేష్ స్కిన్ షో చేసినా... నార్మల్ గా ఉన్నా కూడా అభిమానులు మరియు ప్రేక్షకులు సర్ ప్రైజింగ్ గా ఆమె ఫోటోలను తెగ షేర్ చేస్తూ ఉన్నారు. ఈ ఫోటోల్లో పెద్దగా స్కిన్ షో లేకున్నా కూడా క్యూట్ గా అందంగా కూల్ గా ఉందంటూ కామెంట్స్ చేస్తూ ఫోటోలను తెగ షేర్ చేస్తున్నారు.

# కాజల్ బ్యూటీ సీక్రెట్ పప్పు అన్నమా?

చందమామ కాజల్ అగర్వాల్ బ్యూటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు పెళ్లి చేసుకుని ఓ బిడ్డకు తల్లైనా! అదే బ్యూటీతో ఆకట్టుకుంటుంది. నవ నాయికలా అవకాశాలు అందుకోవడంలోనూ దూకుడు చూపిస్తుంది. యూత్ లో క్రేజీ భామగా దూసుకుపోతుంది. మరి ఈ బ్యూటీ వెనుక సీక్రెట్ ఏంటి? అందరా జిమ్ కి వెళ్లడం..24 గంటలు నీళ్లు తాగడం! మితంగా తినడం వంటివి అనుకుంటే తప్పులో కాలేసినట్లే. కాజల్ బ్యూటీ లెక్క ఇక్కడ వేరే ఉంది. ఉదయాన్ని చిన్న పాటి ఎక్సరసైజులు ముగించిన తర్వాత ఉడకబెట్టిన గుడ్డు తింటుందిట. దాంతో పాటు ఒకొ జొన్న రొట్టె కర్రీతో పాటు తీసుకుంటుందిట. ఇక మధ్నాహ్నం లంచ్ లో...రాత్రి డిన్నర్ లో కచ్చితంగా పప్పు ఉండాల్సిందేనట. రెండు పూటలు రైస్ తప్పకుండా పప్పుతోనే తింటుందిట. ఇంట్లో ఉన్నా..సినిమా సెట్స్ లో ఉన్నా? ఆ రెండు పూటలు పప్పు ఉండాలని ముందే చెబుతుందిట. పప్పు చాలా



ఇష్టంగా తింటుందిట. సాయత్రం పూట శాండ్ వించ్ తింటుందిట. కానీ నాన్ వెజ్ మాత్రం ముట్టుకోదటు. దాని వాసన కూడా పడదంట. పూర్తిగా శాఖాహారిని అంటోంది. అప్పుడప్పుడు అన్నంలోకి రాజ్మా చావల్ తీసుకుంటుందిట. పన్నీరు కూడా ఎంతో ఇష్టంగా తింటుందిట. దీని వల్ల ప్యాట్ ఫామ్ అవుతుందని తెలిసినా తింటుందిట. అలాగే ప్రతీ రోజు ప్రోటీన్ షేక్స్..కొబ్బరి నీళ్లు తాగుతుంటా. చీట్ మీల్ డే రోజు మాత్రం అమ్మ చేసే పరోటాలు కనీసం పదైనా లాంగించాల్సిందే అంటోంది. అలాగే అమ్మడు మంచి మ్యూజిక్ ప్రియురాలు అట. ఇళయరాజా పాటలు ఎక్కువగా వింటుందిట. మణిరత్నం సినిమాలు అప్పుడప్పుడు చూస్తుందిట. పుస్తకాలు కూడా బాగానే చదువుతుందిట. రీడింగ్ హ్యాబిట్ చిన్నప్పటి నుంచి ఉందిట. ఆయన్ రౌండ్ రాసిన ఫౌంటెన్ హెడ్ పుస్తకం ఎంతో ఇష్టంగా చదువుతుందిట. ఇక అమ్మడు నటిగా ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. తెలుగులో మూడు సినిమాలు చేస్తోంది. అలాగే ఇండియన్ -2లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే.




రాష్ట్ర కాంగ్రెస్‌లో మండల కమిటీల వివాదం చిలికిచిలికి గాలి వానలా మారుతోంది. తమ అనుచరులకు కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వట్లేదంటూ పలువురు నేతలు గాంధీ భవన్ బాటపట్టారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తెలియకుండానే 70కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండల కమిటీలు వేయడంపై విభేదాలు తలెత్తాయి. దీంతో పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవికి కమిటీల నియామక అధికారం అప్పగించారు.




యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. హౌడా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. రెండు బోగీల్లోంచి దట్టమైన పొగలు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించి లోకోపైలట్‌కు సమాచారం అందించారు. దీంతో రైలును పగిడిపల్లి–బొమ్మాయిపల్లి మధ్య నిలిపివేశారు. భయాందోళనలతో ప్రయాణికులంతా కిందికి దిగిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. మంటలు క్రమంగా 6 బోగీలకు వ్యాపించాయి. ఇప్పటి వరకు 4 బోగీలు దగ్ధమయ్యాయి. సంఘటన స్థలికి చేరుకున్న రైల్వే సిబ్బంది బోగీల మధ్య లింక్‌ను వేరు చేశారు. అగ్నిమాపక యంత్రాలు అక్కడి చేరుకునేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఇప్పటివరకు మంటలు ఆర్పే ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. స్థానిక పోలీసులు, ఆర్డీవో అక్కడి చేరుకున్నారు. మరోవైపు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సంఘటన స్థలికి బయల్దేరారు. సంఘటన స్థలం నుంచి ఆర్డీవో భూపాల్‌రెడ్డి రైల్వే అధికారులు, అగ్నిమాపక అధికారులతో సంప్రందింపులు జరుపుతున్నారు. బోగీల లింక్‌ను తప్పించం వల్ల మిగతా బోగీలకు మంటలు అంటుకునే అవకాశం లేదని ఆయన అన్నారు. మరోవైపు ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ సామగ్రి అంతా కాలిబూడిదైపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్తున్నానని, తన సర్టిఫికెట్లన్నీ రైలులో ఉండిపోయాయని ఓ యువతి కన్నీరుమున్నీరైంది.

# తెలంగాణ పుట్టుకనే అవమానించిన వ్యక్తి మోదీ

## ప్రధాని పర్యటనను బహిష్కరిస్తున్నాం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ పుట్టుకనే అవమానించిన వ్యక్తి ప్రధాని మోదీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణపై వ్యతిరేకతను నరనరాన జీర్ణించుకున్నారని విమర్శించారు. ఏ మొహం పెట్టుకొని తెలంగాణకు వస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. విభజన హామీలను ప్రధాని మోదీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని మంత్రి కేటీఆర్ అన్నారు. గుజరాత్‌కు రూ.20 వేల కోట్లతో కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చారని, తెలంగాణకు కేవలం రూ.521 కోట్ల నిధులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల ప్రధాని మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రేపటి మోదీ పర్యటనను తామంతా బహిష్కరిస్తున్నామని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ హామీ ఏమైందని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రధాని మోదీని, బీజేపీని ఎందుకు విమర్శించరని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో గాడ్సే దూరాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని ఆరోపించారు. భూ దందాలు చేసే వ్యక్తులే ధరణిని వద్దంటున్నారని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసే పనిచేస్తున్నాయన్నారు. ఆ పార్టీల మోసాలు ప్రజలకు తెలుసని వెల్లడించారు. సీఎం కేసీఆర్ పోరాటాన్ని గుర్తించి ఇతర రాష్ట్రాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పాలనలో ఏదైనా పెరిగిందంటే నిరుద్యోగం, అప్పులు మాత్రమేనని విమర్శించారు. రాహుల్ గాంధీ అడ్డగోలు ఆరోపణలను ప్రజలు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఆయన ఏ అర్హతతో తమపై విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో రాహుల్ హోదా ఏంటని నిలదీశారు. కుసుమ జగదీశ్ అకాల మరణం ఎంతో బాధించిందని, సాయిచంద్ మరణం పార్టీకి ఎంతో తీరని లోటన్నారు. ఇద్దరి అకాల మరణంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కలత చెందారని తెలిపారు. ఇద్దరి కుటుంబాలకు పార్టీ ప్రజాప్రతినిధుల నెల జీతం అందజేస్తామని చెప్పారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా సాయిచంద్ సతీమణి రజిని నియమిస్తున్నామని వెల్లడించారు.

# కాంగ్రెస్ పార్టీ నుంచి యంగ్ హీరో నితిన్ రాజకీయం...?



హైదరాబాద్ : టాలీవుడ్ యంగ్ హీరో నితిన్. ఆయన వరసబెట్టి సినిమాలు చేస్తున్నారు. సినిమాల్లో కొనసాగేందుకు ఆయనకు ఇంకా చాలా ఏజ్ ఉంది. ఇరవై ఏళ్లకే హీరో గా ఎంట్రీ ఇచ్చిన నితిన్ గత రెండు దశాబ్దాలుగా సినిమాలు చేస్తున్నారు. హిట్లతో ఫట్లతో సంబంధం లేకుండా ఆయన కెరీర్ అలా నిలకడగా కొనసాగుతోంది. అలాంటి నితిన్ ఇపుడు ఉన్నట్లుండి రాజకీయాల్లోకి దూకేస్తున్నారా అన్నదే చర్చగా ఉంది. నిజాని కి నితిన్ ని తమ వైపు తిప్పుకోవాల ని కొన్నాళ్ల క్రితం బీజేపీ చూసింది అని టాక్ నడచింది. ఆయనది నిజామాబాద్ జిల్లా లోని మోపాల్ మండలం. అంటే నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్ కి నితిన్ వస్తారు అన్న మాట. ఇదిలా ఉంటే బీజేపీ రమ్మన్నా మరో పార్టీ పిలిచినా రాజకీయాల కు దూరం అని చెప్పిన నితిన్ సడెన్ గా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని స్వయంగా కలిశారు అన్న టాక్ ఇపుడు పెద్ద ఎత్తున వినిపిస్తోంది. నితిన్ అలా ఎందుకు చేశారు అన్నదే చర్చగా ఉంది. నితిన్ మనసు రాజకీయాల వైపు మళ్ళిందా అన్నది అందరి లోనూ పెరిగిపోతున్న అనుమానాలు. అయితే నితిన్ ఫ్యామి లీకి రాజకీయ సంబంధాలు గట్టిగా ఉన్నాయి. ఆయన దగ్గర బంధువులు అంతా రాజకీయాల్లో ఉన్నారు. స్వయంగా ఆయన మేనమామ నగేష్ రెడ్డి గతం లో నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదేళ్ల పాటు పనిచేశారు. ఆయన ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ సెగ్మంట్ టికెట్ ని ఆశిస్తున్నారు అని అంటున్నారు. అయితే అక్కడ గట్టిగానే పోటీ ఉందని అంటున్నారు. ఇదే సీటు కోసం అరికెల నర్సారెడ్డి భూపతి రెడ్డి అని మరో ఇద్దరు దిగ్గజ నేతలు పోటీ పడుతున్నారుట. దాంతో ఇటీవల రేవంత్ రెడ్డి ని నగేష్ రెడ్డి కలసి వచ్చరని ఆయన సీటు కోసమే అంటున్నారు. అయితే సర్వేల లో ఎవరికి విజయావకాశాలు ఉంటే వారికే టికెట్ ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారట. దాంతో నగేష్ రెడ్డి తరఫున మేనల్లుడు అయిన నితిన్ వెళ్లి ఈ సీటు విషయం లో రేవంత్ రెడ్డి ని కోరినట్లుగా ప్రచారం సాగుతోంది. అంటే తాను కాకుండా తన మేన మామకే టికెట్ కోసం ఆయన ప్రయత్నం చేస్తున్నారు అని అంటు న్నారు. అయితే నితిన్ పోటీ కి బరి లో దిగుతున్నాట్లుగా వార్తలు అ యితే ప్రచారం లో ఉన్నాయి. మరి వాస్తవాలు ఏమిటో తెలియవు కానీ నితిని రేవంత్ రెడ్డి తో భేటీ కావడం మాత్రం చర్చకు తావిస్తోంది. ఇక నితిన్ కెరీర్ ని వదులుకు ని రాజకీయాల్లో వస్తారు అంటే మాత్రం ఎవరూ నమ్మేలా లేదు. ఆయన మేనమామ కోసమే ప్రయత్నం అని మాత్రం అంటున్నారు. చూడాలి మరి ఈ యంగ్ హీరో దారి ఎటు వైపో అన్నది.

# దేశంలో అత్యధికంగా వేతనం తీసుకుంటున్న ఆశావర్కర్లు తెలంగాణలోనే: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: దేశంలో అత్యధికంగా వేతనం తీసుకుంటున్న ఆశా వర్కర్లు తెలంగాణలోనే ఉన్నారని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆశా వర్కర్ల మొబైల్ బిల్లులను ప్రభుత్వమే భరిస్తున్నదని చెప్పారు. బస్తీ దవాఖానలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో కొత్తగా ఎంపికైన 15 వేల మంది ఆశావర్కర్లకు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీతో కలిసి మంత్రి హరీశ్ రావు నియామక పత్రాలు అందేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఒకప్పుడు ఏ రోగం వచ్చినా గాంధీ, ఉస్మానియా దవాఖానలకు వెళ్లేవాళ్లమని.. స్వరాష్ట్రంలో ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశారని వెల్లడించారు. దీంతో ఉస్మానియా, గాంధీ హాస్పిటళ్లలో ఓపీ శాతం తగ్గిందని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి హరీశ్ చెప్పారు. కేసీఆర్ కిట్‌తో మాతా శిశు మరణాలను తగ్గించామని చెప్పారు. పైసా ఖర్చు లేకుండా టీ-డయాగ్నొస్టిక్స్‌లో ఉచితంగా 134 పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

**తెలంగాణకు అసలైన డాక్టర్ హరీశ్ రావు: మంత్రి తలసాని –** ఆశావర్కర్ల సేవలు మరచిపోలేనివని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణలోని ఆరోగ్య సేవలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రజలు ప్రభుత్వ దవాఖానలవైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు.

కరోనా సమయంలో ఆశావర్కర్ల సేవలు విశేషమైనవని తెలిపారు. తెలంగాణకు అసలైన డాక్టర్.. మంత్రి హరీశ్ రావు అని వెల్లడించారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లకు రూ.9,750 వేతనం ఇస్తున్నామన్నారు.

# ఈ నాలుగే బండికి మైనస్ అయ్యాయా ?



హైదరాబాద్ : తెలంగాణాలో బీజేపీ అధ్యక్షుడి మార్పు జరిగిపోయి రెండురోజులైనా ఇంకా ఆ వేడి రగులుతునే ఉంది. పార్టీ నేతల మధ్య అధ్యక్షుడి మార్పు పై హాటుహాటుగా చర్చలు జరుగుతునే ఉన్నాయి. ఈ నేపధ్యంలోనే బండి తొలగింపు కారణాల పై చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇంతకీ తొలగింపుకు నాలుగు కారణాలున్నాయని కమలనాదులు చెబుతున్నారు. అవేమిటంటే పార్టీని సంస్ధాగతంగా బలోపేతం చేయకపోవటం నియోజకవర్గాల్లో గట్టి నేతలను గుర్తించలేకపోవటం. అలాగే ఇతర పార్టీల నుండి నేతలను చేర్చుకోలేకపోవటం పార్టీలోని సీనియర్లందరినీ కలుపుకుని వెళ్ళలేకపోవటం. ఈ నాలుగు పాయింట్లే బండికి పెద్ద మైనస్ అయినట్లు బాగా ప్రచారంలో ఉంది. వచ్చేఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావాలంటే ముందు సంస్ధాగతంగా బలంగా ఉండాలి. ఎంతసేపు కేసీయార్ ఫ్యామిలీ మీద గోల చేయటమే కాని 119 నియోజకవర్గాల్లో సభ్యత్వనమోదు చేయించటం బూత్ కమిటీలను ఏర్పాటుచేయటం గ్రామాల నుండి నియోజకవర్గాలు జిల్లాల కమిటీలను వేయటంపై పెద్దగా దృష్టిపెట్టలేదు. ఎంతసేపు అధికారంలోకి వచ్చేస్తామని పొద్దున లేచిందగ్గర నుండి ఒకటే ఊదరగొట్టడమే తప్ప 119 నియోజకవర్గంలో గట్టి అభ్యర్ధులను గుర్తించటం లేదా తయారు చేసుకోలేకపోయారు. పార్టీవర్గాల సమాచారం ప్రకారం మహాయితే ఓ 40 నియోజకవర్గాల్లో గట్టి నేతలుంటే చాలా ఎక్కువట. ఈ నేపధ్యం లోనే ఇతర పార్టీల నుండి గట్టి నేతలను చేర్చుకుని పోటీలోకి దింపాలని అనుకున్నారు. అయితే ఈ ప్రోగ్రామ్ అంతగా వర్కవుట్ కాలేదు. ఎందుకంటే సీనియర్ల మధ్య సమన్వయలోపం కారణంగా ఇతర పార్టీల్లోని గట్టి నేతల్లో ఎక్కువమంది బీజేపీవైపు చూడలేదు. ఫైనల్ గా సీనియర్లయిన ఈటల రాజేందర్ కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి జితేందర్ రెడ్డి విజయశాంతి ఇంద్రసేనారెడ్డి లాంటి చాలామందితో బండికి పడదు. అందుకనే సొంతజిల్లా కరీంనగర్ లో బండి పై తిరుగుబాటు లేచింది. కరీంనగర్ లో మొదలైన తిరుగుబాటు హైదరాబాద్ జిల్లా పార్టీ దాకా పాకింది. నిజానికి సీనియర్లందరినీ కలుపుకుని వెళ్ళలేకపోవటమనే సమస్య అధ్యక్షునిగా ఎవరున్నా వస్తుంది. అయితే ఉన్నంతలో ఎక్కువమంది సీనియర్లను కలుపుకునుంటే బాగుండేది. ఎన్నికలు మరో నాలుగు నెలలుండగా అధ్యక్షుడైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఏమిచేస్తారో చూడాలి.




వనపర్తి: తెలంగాణలోని వనపర్తి జిల్లా అమరచింత కస్తూర్బా విద్యాలయంలో కలుషిత ఆహారం కలకలం రేపింది. రాత్రి తీసుకున్న భోజనం వికటించి 70 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 210 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిన్న రాత్రి వీరికి వంకాయ, సాంబారుతో కూడిన ఆహారాన్ని వడ్డించారు. రాత్రి భోజనం అయ్యాక 11 గంటల ప్రాంతంలో విద్యార్థినులకు కడుపునొప్పి ప్రారంభం కావడంతో ఒక్కొక్కరుగా సిబ్బంది దగ్గరకి వెళ్లారు. కేజీబీవీలో ఒక టీచర్, వాచ్‌మన్ మాత్రమే ఉండటంతో రాత్రి విద్యార్థినులకు బయటకి పంపలేదు. రాత్రంతా పరిస్థితి అలాగే ఉండటంతో.. తెల్లవారు జామున ఓ ప్రైవేటు ఆటో తీసుకొచ్చిన సిబ్బంది వారందర్నీ సమీపంలోని ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిల్లలందరికీ వైద్యులు, సిబ్బంది హుటాహుటిన చికిత్స ప్రారంభించగా.. చాలా వరకు పరిస్థితి అదుపులోకి వచ్చింది. నలుగురు విద్యార్థులకు కడుపునొప్పి తగ్గకపోవడంతో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఒక్కొక్కరుగా ఆత్మకూరు ఆస్పత్రికి చేరుకుంటున్నారు. తమ పిల్లల పరిస్థితి చూసి వారు ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఆహార కలుషితం జరిగిందా? ఇంకేమైనా కారణాలున్నాయా? అనే కోణంలో విచారిస్తున్నారు. ప్రధానంగా 9, 10, ఇంటర్ విద్యార్థినులే అస్వస్థతకు గురైన వారిలో ఉన్నారు. తొలుత 45 మందిని ఆ తర్వాత మరో 15 మందిని ఆస్పత్రిలో చేర్పించారు. ఆహారం విషతుల్యం కావడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విద్యార్థినులు వాపోతున్నారు.

# కోమటిరెడ్డికీ పదవి.. బీజేపీ బంధం వేసిందా!



హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో రాత్రికి రాత్రి మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆ పార్టీలో నేతల అసంతృప్తిని అంచనా వేస్తున్న బీజేపీ పెద్దలు .. పార్టీని వీడి పోతారని భావిస్తున్నవారిని పదవులతో బంధం వేస్తున్నా రు. ఇటీవల ఈటల రాజేందర్ పార్టీని వీడేందుకు రెడీ అయ్యారు అనుకున్న సమయంలో పక్కాగా ఆయనను పదిల పరుచుకునేందుకు ఎన్నికల కమిటీ చైర్మన్ పదవిని అప్పగించారు. దీంతో ఈటల తన వ్యూహాలకు ఫుల్ స్టాప్ పెట్టక తప్పలేదు. ఇక ఇప్పుడు తాజాగా.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కూడా బీజేపీ పెద్దలు బంధం వేశారు. ఆయన కొన్నాళ్లుగా మళ్లీ కాంగ్రెస్లోకి వెళ్లిపోతారంటూ.. ప్రచారం జరిగింది. దీనికి దన్నుగా.. ఆయన బుధవారం.. పొంగులేటి శ్రీనివాసరెడ్డితో భేటీ అయ్యారు. అయిందేదో అయిపోయింది.. అన్నట్టుగా మాట్లాడారు. ఇక పార్టీ పెద్దలతో చర్చించడమే తరువాయి.. తాను కండువా మార్చుకుంటానని రాజగోపాల్ రెడ్డి చెప్పినట్టు కూడా ప్రచారంలోకి వచ్చింది. అంతే.. ఇంతలోనే కేంద్రంలోని పెద్దల నుంచి ఉత్తర్వు వచ్చేసింది. "పార్టీ నాయకుడు మాజీ ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డిని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తున్నాం. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుంది" అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నియామకం చేసినట్టు తెలిపారు. అయితే.. ఈ నియామకం వెనుక పక్కాగా.. రాజగోపాల్రెడ్డిని ఎటూ కదలకుండా చేయడమే వ్యూహంగా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. మరి దీనిపై కోమటిరెడ్డి ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

# సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని.. డీఐజీ ఆత్మహత్య



కోయంబత్తూర్: సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని తమిళనాడుకు చెందిన పోలీసు ఉన్నతాధికారి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. డీఐజీ ర్యాంకుకు చెందిన ఆయన శుక్రవారం తన నివాసంలోనే ప్రాణాలు తీసుకున్నారు. ప్రాథమిక వివరాల ప్రకారం.. సి. విజయ్ కుమార్.. కోయంబత్తూర్ సర్కిల్‌లో డీఐజీ హోదాలో పనిచేస్తున్నారు. ఆ నగరానికి చెందిన రెడ్‌ఫీల్డ్స్‌లోని క్వార్టర్స్‌లో తన కుటుంబంతో కలిసి ఆయన నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ప్రాణాలు తీసుకున్నారని సమాచారం. తీవ్ర ఒత్తిడే ఆయన మరణానికి కారణమని తెలుస్తోంది. పోస్ట్‌మార్టం నిమిత్తం కోయంబత్తూర్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్‌కు మృతదేహాన్ని తరలించారు. ఈ ఏడాది జనవరి నుంచి విజయ్ కుమార్ డీఐజీ హోదాలో పనిచేస్తున్నారు. ఆయన 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన కాంచీపురం, కడలూరు, నాగపట్టణం, తిరువూరు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. కోయంబత్తూర్ సర్కిల్‌కు రాకముందు చెన్నైలో డీసీపీగా విధులు నిర్వర్తించారు.

# విద్యాశాఖలో సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ.. హాజరైన మంత్రి కేటీఆర్



హైదరాబాద్: విద్యాశాఖలో సమస్యల పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయింది. హైదరాబాద్‌ని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, సత్యవతి రాథోడ్, జగదీశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో సుదీర్ఘంగా ఉన్న సమస్యలపై చర్చిస్తున్నారు. టెట్ (%ుజు%) నిర్వహణ, టీచర్ల నియామక ప్రక్రియ, మన ఊరు–మన బడి, మన బస్తీ–మన బడి, రెండో విడుత అమలు వంటి వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తున్నది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com